


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 99 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం గురువారం 19 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 99 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 19 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



# విశాఖ తీరంలో నౌకాదళ విన్యాసాలు..

## ఐఎన్ఎస్ సుమేధపై రాష్ట్రపతి, సీఎం ప్రయాణం



- ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ వేడుకలకు హాజరైన ద్రౌపది ముర్మ
- వేడుకల్లో కదం తొక్కిన 71 యుద్ధ నౌకలు
- ప్రత్యేక ఆకర్షణగా 19 విదేశీ నౌకలు



పెన్ పవర్ డెస్క్:విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) వేడుకలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో పాటు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా నౌకాదళ సిబ్బంది నుంచి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె ఐఎన్ఎస్ సుమేధ యుద్ధ నౌకలో ప్రయాణించారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. సముద్ర అలలపై వరుసగా నిలిచిన యుద్ధ నౌకలను వారు వీక్షించారు.

**71 యుద్ధ నౌకల విన్యాసాలు..**

ఈ ఫ్లీట్ రివ్యూలో భారత నావికాదళ సత్తాతో పాటు ప్రపంచ దేశాల నౌకలు కూడా కదం తొక్కాయి. ఆరు వరుసల్లో మొత్తం 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. భారత నేవీకి చెందిన 45 నౌకలతో పాటు కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ మరియు పరిశోధన నౌకలు ఇందులో పాల్గొన్నాయి. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ వంటి వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విశాఖ సముద్ర తీరం యుద్ధ నౌకల గర్జనలు, నావికాదళ విన్యాసాలతో సందడిగా మారింది. దేశ రక్షణలో నౌకాదళం పోషిస్తున్న కీలక పాత్రను ఈ వేడుక ప్రతిబింబించింది.



## మంత్రి కాన్వాయ్‌పై దాడి... బాల్క సుమన్ అరెస్టు

- క్యాతనపల్లిలోని నివాసంలో సుమన్‌ను అరెస్టు చేసిన పోలీసులు
- అడ్డుకునే ప్రయత్నం చేసిన కార్యకర్తలపై లాఠీఛార్జ్
- కాన్వాయ్‌పై దాడి కేసులో ఏ1గా బాల్క సుమన్

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ రాష్ట్ర మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసులో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

- మిగతా 2లో...


## కల్తీ నెయ్యి అంశంపై చర్చకు సిద్ధం... ఆధారాలు ఉంటే అసెంబ్లీలో చర్చకు రండి

- రసాయనాలతో నెయ్యి తయారు చేశారని సిట్ రిపోర్ట్ ఇచ్చిందన్న అనిత
- పింక్ డైమండ్ పేరుతో గతంలో సభా సమయం వృథా చేశారని మండిపాటు
- సాక్షిలో రాసే విషయాలనే వైసీపీ నేతలు మాట్లాడుతుంటారని ఎద్దేవా

- మిగతా 2లో...



పెన్ పవర్ డెస్క్:తిరుమల లడ్డూలోని కల్తీ నెయ్యి వ్యవహారంపై సభలో చర్చించాలని వైసీపీ పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత మాట్లాడుతూ కల్తీ నెయ్యి వ్యవహారంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధమని అన్నారు. చర్చకు ఆధారాలతో రావాలని వైసీపీకి సవాల్ విసిరారు. ప్రజాహితం కోసం ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు సవాల్ విసిరారు.




## చైనా రోబో డాగ్ కొని తామే అభివృద్ధి చేశామని ప్రచారం.. ఏఐ సదస్సులో యూనివర్సిటీ చీటింగ్

- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో బయటపడ్డ మోసం
- గల్గోటియాస్ యూనివర్సిటీని సదస్సు నుంచి బహిష్కరించిన నిర్వాహకులు
- విద్యార్థుల పరిశోధనల కోసమే వాడుతున్నట్లు వర్సిటీ వివరణ

- మిగతా 2లో...

## మేం కూడా లడ్డూపై చర్చిద్దామనే కోరుతున్నాం

- తిరుమల లడ్డూపై శాసనమండలిలో చర్చించాలన్న బొత్స సత్యనారాయణ
- ఇందాపూర్, హెరిటేజ్‌పై చర్చించాల్సిందే అని డిమాండ్
- వాస్తవాలను తేల్చడానికి చర్చకు రావాలన్న బొత్స

2లో...



---

## నేను భారత్‌కు వస్తానో, రానో తెలియదు.. ఎందుకంటే!

### బాంబే హైకోర్టుకు తెలిపిన విజయ్ మాల్యా

- బ్రిటన్ దాటి రాకుండా చట్టపరమైన ఆంక్షలు ఉన్నట్లు వెల్లడి
- ఎప్పుడు తిరిగి వస్తానో తెలియదన్న విజయ్ మాల్యా
- మాల్యా తరఫున స్టేట్‌మెంట్ సమర్పించిన న్యాయవాది అమిత్ దేశాయ్



పెన్ పవర్ డెస్క్:భారతీయ బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి లండన్ పారిపోయిన వ్యాపారవేత్త విజయ్ మాల్యా తాను భారత్‌కు తిరిగి రాలేనని బాంబే

- మిగతా 2లో...

## ఆ ఒక్కటి తప్ప... జైలు జీవితం బాగా ఎంజాయ్ చేశాను



- బెయిల్ పై జైలు నుంచి విడుదలైన అంబటి రాంబాబు
- జైలులో బాత్రూంలో జారిపడటం మినహా తనకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని వ్యాఖ్య
- తనను చంద్రబాబు, లోకేశ్ టార్గెట్ చేశారని తీవ్ర ఆరోపణలు
- కూటమి ప్రభుత్వంపై పోరాటం ఆగదని స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి 18 రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలైన వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జైలు జీవితం తనలో మరింత పట్టుదలను నింపిందని, దాన్ని తాను శిక్షగా కాకుండా ఒక శిక్షణగా భావించానని అన్నారు.

- మిగతా 2లో...



## రాష్ట్రంలోని రైతు సోదరులకు శుభవార్త!

- రాష్ట్రవ్యాప్తంగా శనగల కొనుగోళ్ల ప్రారంభం
- 94,500 మెట్రిక్ టన్నుల శనగల సేకరణకు నిర్ణయం
- రైతు సేవా కేంద్రాల ద్వారా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ
- కొనుగోలు చేసిన 15 రోజుల్లోనే రైతు ఖాతాల్లోకి నగదు జమ

- మిగతా 2లో...

## దేశ భద్రతకు రాహుల్ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి

- దేశ వ్యతిరేక శక్తులతో సంబంధాలు పెట్టుకున్నారని ఆరోపణ
- రాహుల్ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న నిషికాంత్ దూబే
- ఆయనపై జీవితకాల నిషేధం విధించాలని డిమాండ్

- మిగతా 2లో...



## భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం

- భారత్ ఒక గొప్ప సాంకేతిక పరివర్తన దశలో ఉందన్న సుందర్ పిచాయ్
- దేశ భవిష్యత్తును ఏఐ నిర్దేశించబోతోందని ఉద్ఘాటన
- ప్రధాని మోదీతో భేటీ, ఏఐపై సహకారానికి చర్చలు
- గూగుల్ జెమినైకి భారత్ అతిపెద్ద మార్కెట్లలో ఒకటి అని వెల్లడి
- అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో కలిసి విద్యార్థులకు కోడింగ్, రోబోటిక్స్



పెన్ పవర్ డెస్క్:భారతదేశం ఒక గొప్ప సాంకేతిక పరివర్తనకు నాంది పలుకుతోందని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషించనుందని ఆల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. ప్రస్తుత దశను పరివర్తన సమయంగా ఆయన అభివర్ణించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ఇది టెక్నాలజీ, ఆవిష్కరణలు, మరియు ఏఐ విస్తృత వినియోగంతో నడిచే ఒక దశాబ్ద కాలపు మార్పుకు నాందిలా అనిపిస్తోంది" అని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా లబ్ధి పొందేందుకు భారతదేశం ప్రత్యేకమైన స్థితిలో ఉందని,

- మిగతా 2లో...

## ముక్కుపచ్చలారని పసిబిడ్డపై గంజాయి మత్తులో జరిగిన పైశాచికం ఇది

- మదనపల్లిలో బాలికపై జరిగిన అఘాయిత్యంపై వైఎస్ షర్మిల తీవ్ర విచారం
- గంజాయి మత్తులోనే ఈ దారుణం జరిగిందని ఆరోపణ
- డ్రగ్స్‌ను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- గంజాయిపై ఉక్కుపాదం మోపాలని సీఎం చంద్రబాబుకు డిమాండ్
- బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి

- మిగతా 2లో...

పెన్ పవర్ డెస్క్:మదనపల్లెలో ఏడేళ్ల బాలికపై జరిగిన హత్యాచారం అత్యంత దారుణమని, గంజాయి మత్తులో ముక్కుపచ్చలారని పసిబిడ్డపై జరిగిన ఈ పైశాచిక ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ దారుణ ఘటన పట్ల కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నామని, బాలిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలు ఏరులై పారుతున్నాయనడానికి మదనపల్లె



## ఎడిటర్ వ్యూ

### తొలి మహిళా కార్టూనిస్టు రాగతి పండరి

రాగతి పండరి పేరు చెబితే వెంటనే గుర్తుకు వచ్చేవి నవ్వు తెప్పించే కార్టూన్లే. ఆమె పేరు తెలియని సాహిత్య అభిమానులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. వ్యంగ్య చిత్రాలతో నవ్వించాలనే లక్ష్యంతో అన్ని అడ్డంకులను అధిగమించి జీవిత ఆశయం నెరవేరుకున్న అపురూప కళాకారిణి. సామాజిక అంశాలను ప్రతిబింబించే కార్టూన్లు గీస్తూ మన్ననలు, పురస్కారాలూ అందుకున్న కార్టూనిస్టు రాగతి పండరి. విధి వంచితయై, నాలుగ డుగులు వేసి చుట్టూ ఉన్న ప్రపం చంలో స్వేచ్ఛగా తిరిగే భాగ్యానికి నోచుకోకపోయినా అన్నింటిని అవగాహన చేసుకొని హాస్యంలో రంగరించి లక్ష్యాన్ని చేరుకున్న ఘనత, అసమాన ప్రతిభ ఆమెకే సొంతం.రాగతి పండరి (జూలై 22, 1965 – 19 ఫిబ్రవరి, 2015) తెలుగు వ్యం గ్య చిత్రకారులలో రాశి లోనూ, వాసి లోనూ సమానమైన కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించుకున్న ఏకైక మహిళా కార్టూనిస్టు. అంతే కాదు, అనతి కాలంలోనే తెలుగు వ్యంగ్య చిత్ర ఖుళా రంగంలో ఎనలేని పేరు తెచ్చుకుని, ఆ రంగంలో అగ్రగణ్యు లైన బాపు, జయదేవ్ ల సరసన నిలబడ గలిగిన స్థాయి చేరుకున్న గొప్పతనం ఆమెది. ఆ గొప్పతనం వెనక అకుంఠిత దీక్ష, అంకిత భావంతో కృషి, వ్యంగ్య చిత్ర కళ మీద ఎనలేని ప్రేమ, నిరంతర పరిశ్రమ ఉన్నాయి. దురదృష్ట వశాత్తూ, ఆమెకు చిన్నతంలో వచ్చిన పోలియో మూలంగా శారీరకంగా బలహీనురాలైనా, ఆ బలహీనతను అధిగమించి, మానసిక ఒత్తిడిని అతిక్రమించి, తనకు ఇష్టమైన కళకే అంకితమై, కార్టూన్లు గీసి అందరి మన్ననలు పొందారు. ఆమె కార్టూనులో ఏ మూల వెదికినా తేట తెలుగు దనమే, ఏ చోట స్పృశించినా తేనెల తెలుగు మాటలే దర్శనం ఇస్తాయి. పండగలు, పబ్బా లు, అల్లుళ్ళు, ఆడ పడుచులు, దొంగలు, పోలీసులు, ఆఫీసులు, పార్కులూ, ఆమె తాకని విషయం లేదు, లాగని తీగ లేదు, నడవని డొంక లేదు. తెలుగు వ్యంగ్య చిత్ర రంగంలో అనేక వ్యంగ్యచిత్ర ధారా వాహికలు వార పత్రికలలో నిర్వ హించిన ఘనత ఆమెదే. పన్నెండు వేలకు పైగా కార్టూన్లు వేసిన ఏకైక మహిళగా ఆమె గుర్తింపు పొందారు. రాగతి పండరి 1965 సంవత్సరం జూలై 22న విశాఖ పట్టణంలో రాగతి గోవిందరావు, శాంతకుమారి దంపతులకు జన్మించారు. చదువు ఇంటి వద్దనే కొనసాగింది. అతి చిన్న వయసులోనే పోలియో వచ్చి, శారీరక లోపం ఏర్పడినా, పట్టు దల, ధైర్యం కలిగి జీవితాన్ని ఆత్మ విశ్వాసంతో, కఠోర పరిశ్రమతో ఎదుర్కొని, కార్టూన్ రంగంలో అగ్ర గణ్యుల సరసన చేరారు. ఆమె తన వ్యంగ్య చిత్ర ప్రస్థానాన్ని 1973లో తన 8వ ఏటనే మొదలు పెట్టారు. బాల్యంలోనే వ్యంగ్య చిత్రాలు ప్రచురణ ప్రారంభ మయ్యింది. 1980–1990 దశకాల మధ్య కొన్ని వేల వ్యంగ్య చిత్రాలను శరపరంపరగా చిత్రించారు. పాఠకుల మనసులను దోచుకున్నారు. అన్ని ప్రముఖ వార, మాస పత్రికలలో ఈమె కార్టూన్లు ప్రచురించ బడ్డా యి. పండుగల సందర్భాలలో పత్రికల సంపాదకులు ఆమె కార్టూన్లను కోరుకుని, అడిగి తెప్పించుకుని తమతమ పత్రికలలో ప్రచురించేవారు. రాగతి పండరి ఆలోచన వచ్చిందే తడవుగా కాగితంపై పెన్సిల్‌తో గీతలు కూడా గీసు కోకుండా నేరుగా స్కెచ్‌పెన్నుతోనే కార్టూన్ వేసేవారు. ఆ క్రమంలో ఐదు పది నిమిషాల స్వల్ప వ్యవధిలోనే కార్టూన్ గీసే విభిన్నమైన శైలి ఆమెది. జయదేవ్ గురువుగా భావించి ఆయన శైలిలో కొద్దిరోజుల పాటు కార్టూన్లు వేసినా, వేగంగా తనదంటూ ఓ ప్రత్యేకమైన శైలిని ఏర్పరుచుకుని ఆమె గీత చూడగానే గుర్తుపట్టేలా శైలిని ఏర్పరుచుకున్నారు. రాగతి పండరి కార్టూన్లలో ఆడవారిని గయ్యాళి భార్య గానో, అత్త గానో మాత్రమే కాకుండా, అనేక ఇతర పాత్రలను, సృష్టించి, చూపించారు. కుదురైన చక్కటి చిత్రీకరణ, గుండ్రటి చేతివ్రాత, తేట తెలుగులో సంభాషణలు ఆమె వ్యంగ్య చిత్రాల ప్రత్యేకత. తెలుగు వ్యంగ్య చిత్రరంగంలో అనేక వ్యంగ్య చిత్ర ధారావాహికలు వార పత్రికల లో నిర్వహించిన ఘనత ఆమెది. సమకాలీన వ్యంగ్య చిత్రాకారు లలో, వార్తా పత్రికలలో పనిచేస్తూ ఉన్న కార్టూనిస్టలను మినహాయిస్తే, రాజకీయ వ్యంగ్య చిత్రాలు వేసే ఏకైక ఫ్రీలాన్స్ కార్టూనిస్టు ఆమె. 'రాజకీయ చెదరంగం' అన్న పేరుతో ఒక దశాబ్దం పైగా రాజకీయ వ్యంగ్య చిత్రాలను ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురించబడటం తనకెంతో ఆనందం కలిగించిందని ఆమె చెపుతుండే వారు. ఆమె వ్యంగ్య చిత్రాలు హాస్యం ప్రధానం గా, ఆకర్షణీయంగా ఉండి, మానవ ప్రవృత్తిలో ఉన్న ద్వంద్వ అలోచానా విధానం, సాఘిక దురాచారాల పట్ల విమర్శల తో కూడి పాఠకులను నవ్వులలో ముంచెత్తటమే కాకుం డా, ఆలోచించటానికి కూడా ఉద్యు క్తులను చేస్తాయి.2001 సంవత్సరం ఉగాది పురస్కారం ఆంధ్ర ప్రదేశ్ అప్పటి గవర్నర్ సి.రంగరాజన్ చేతుల మీదుగా అందుకున్నారు. రాగతి పండరి కార్టూన్ సామ్రా జ్యాన్ని మొత్తం తన కైవసం చేసుకు న్న ఏకైక మహిళ కార్టూనిస్టుగా పేరు ప్రఖ్యాతుల నార్జించారని ఆమె గురు తుల్యులు కార్టూనిస్టు జయ దేవ్, వ్యాఖ్యానించారు. కాలక్రమే ణా, తనకంటూ స్వంత శైలి ఏర్పరుచుకుని, చాలామంది మగ తెలుగు కార్టూనిస్టులు, వృత్తి పరంగా అసూయ పడేలా దూసుకు వచ్చిన ఒకే ఒక మహిళా కార్టూని స్టుగా కార్టూనిస్టు రామకృష్ణ అభివ ర్ణించారు. కార్టూన్ల సాధనలో మొదట్లో తాను గీసిన చిత్రాలను చెన్నైలో నివసించే కార్టూనిస్టు జయదేవ్‌కు పండరి పంపితే మెచ్చు కోవడమే కాకుండా, ఆయన జవాబు రాస్తూ, కార్టూన్లను అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. స్వయంగా విశాఖపట్నం వచ్చి తన శిష్యురాలిని అభినందిం చారు.. బాపు అంతటి గొప్ప చిత్రకారుడు రచన మాస పత్రికలో 2005లో ప్రచురించిన వినాయక చవితి కార్టూన్ మెచ్చుకొంటూ లేఖ రాసి, పండరి కార్టూన్‌కు బాపు బొమ్మ గీయడం విశేషం. 2015 ఫిబ్రవరి 19 న విశాఖ పట్టణంలో ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధితో కన్ను మూశారు. ఆమె కోరిక ప్రకారం కుటుంబ సభ్యులు ఆమె అవయ వాలను సావిత్రిబాయి పూలే మెమోరియల్ ట్రస్ట్ ద్వారా దానం చేశారు.

## ఆ ఒక్కటి తప్పు... జైలు జీవితం బాగా ఎంజాయ్ చేశాను

- మొదటి పేజి తరువాయి

అయితే, ఈ సమయంలో తాను ఎదుర్కొన్న ఏకైక ఇబ్బంది బాత్రూంలో జారిపడటమేనని, అది మినహా జైలు జీవితాన్ని పూర్తిగా ఎంజాయ్ చేశానని వ్యాఖ్యానించారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వంపై తన పోరాటం ఇకపై రెట్టింపు ఉత్సాహంతో కొనసాగుతుందని స్పష్టం చేశారు.

"నన్ను 18 రోజులు జైల్లో పెడితే భయపడతానని చంద్రబాబు, లోకేశ్ అనుకున్నారేమో. కానీ, ఈ అంబటి రాంబాబు ఎవరికీ భయపడే ప్రశ్నే ఉద్భవించదు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పుడే జైల్లో ఉండటానికి సిద్ధపడ్డాను. నన్ను జైల్లో పెట్టాలని వారు ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నారు, ఇప్పుడు అవకాశం దొరికింది, లోపల పెట్టారు. కానీ కాలం మళ్లీ తిరిగొస్తుంది. వారు చేసిన పాపానికి మూల్యం చెల్లించక తప్పదు" అని అంబటి హెచ్చరించారు. జైలు తనలో మరింత కసిని, పట్టుదలను పెంచిందని, ఒక్క అడుగు కూడా వెనక్కి వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

**దాడి వెనుక చంద్రబాబు, లోకేశ్**

తన ఇంటిపై జరిగిన దాడి ఘటనను పూర్తిగా చంద్రబాబు, లోకేశ్ పర్యవేక్షించారని అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. "సుమారు ఏడు గంటల పాటు నా ఇంటిపై దుండగులు దాడి చేస్తుంటే పోలీసులు అక్కడే ఉన్నారు. వారి సమక్షంలో, వారి రక్షణలోనే ఈ దాడి జరిగింది. నన్ను రక్షించాల్సిన పోలీసులే 'సార్, మీరు గోడ దూకి పారిపోండి' అని చెప్పారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇది ఆటవిక రాజ్యం కాదా?" అని ఆయన ప్రశ్నించారు. దాడి చేసిన వారికి వెంటనే బెయిల్ వచ్చిందని, బాధితుడినైన తనకు మాత్రం 18 రోజుల తర్వాత బెయిల్ లభించిందని అన్నారు. తన భార్యాబిడ్డలను, మనవళ్లను భయభ్రాంతులకు గురిచేశారని, తనను చంపడానికి కూడా ప్రయత్నించారని ఆరోపించారు.

**జైల్లో సాధారణ ఖైదీగానే..**

జైల్లో అధికారులు నిబంధనల ప్రకారమే వ్యవహరించారని, తాను ప్రత్యేక సౌకర్యాలు ఏవీ కోరలేదని అంబటి తెలిపారు. "జైల్లో పెట్టే ఆహారమే తిన్నాను. అది నాకు నచ్చలేదు. కానీ కలకాలం తినను కదా? బయటి భోజనం కోసం కోర్టు అనుమతి ఇవ్వలేదు. అందుకే లోపలి భోజనమే చేశాను. అందుకే కొంచెం చిక్కినట్టు ఉన్నా, ఆరోగ్యంగానే ఉన్నాను. ఎలాంటి ఇబ్బంది లేదు" అని వివరించారు.జగన్ నాయకత్వంలోనే తన రాజకీయ ప్ర స్థానం కొనసాగుతుందని, ప్రాణం ఉన్నంతవరకు ఆయన వెంటే నడుస్తానని అంబటి రాం బాబు పునరుద్ఘాటించారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, ఎన్ని కేసులు పెట్టినా, ఎన్నిసార్లు జైల్లో పెట్టినా తాను వెనకడుగు వేయనని, ప్రజాస్వామ్యబద్ధంగా ఈ కూటమి ప్రభుత్వాన్ని కూల్చేంతవరకు తన పోరాటం ఆగదని ప్రకటించారు. రాష్ట్రంలో జరిగిన పరి ణామాలపై తనకు పూర్తి సమాచారం లేదని, అన్ని విషయాలు తెలుసుకుని గుంటూరులో రేపు విలేకరుల సమావేశంలో సమగ్రంగా మాట్లాడతానని ఆయన వెల్లడించారు.

## నేను భారత్‌కు వస్తానో, రానో తెలియదు.. ఎందుకంటే!

- మొదటి పేజి తరువాయి

హైకోర్టుకు తెలియజేశారు. తాను భారత్‌కు ఎప్పుడు తిరిగి వస్తానో తెలియదని అన్నారు. తాను బ్రిటన్ దాటి రాకుండా చట్టపరమైన ఆంక్షలు ఉన్నాయని, అందుకే ఎప్పుడు తిరిగి వచ్చేది చెప్పలేనని తెలిపారు.ఈ మేరకు విజయ్ మాల్యా తరపు న్యాయవాది అమిత్ దేశాయ్ బాంబే కోర్టులో ఒక స్టేట్‌మెంట్‌ను సమర్పించారు. మాల్యా దగ్గర యాక్టివ్ ఇండియన్ పాస్‌పోర్టు లేదని, అదేవిధంగా దేశం దాటి వెళ్లకుండా ఇంగ్లండ్, వేల్స్ కోర్టుల ఆంక్షలు ఉన్నాయని కోర్టుకు సమర్పించిన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు.బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రశేఖర్, జస్టిస్ గౌతమ్ అంఖద్‌లతో కూడిన ధర్మాసనం గత వారం విజయ్ మాల్యా పిటిషన్‌పై విచారణ జరపడానికి నిరాకరించింది. తనను పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించడాన్ని ఆయన కోర్టులో సవాల్ చేశారు. అయితే మాల్యా భారత్‌కు రాకుండా ఈ పిటిషన్‌పై విచారణ జరపలేమని స్పష్టం చేసింది. మాల్యాకు భారత్‌కు తిరిగొచ్చే ఉద్దేశం ఉందా, లేదా? అని ప్రశ్నించింది.ఈ నేపథ్యంలో మాల్యా తన తరఫు న్యాయవాది ద్వారా బాంబే హైకోర్టులో తాజా స్టేట్‌మెంట్‌ను సమర్పించారు. ఈ పిటిషన్ విచారణ జరిపేందుకు ఆయన ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం లేదంటూ అమిత్ దేశాయ్ కోర్టులో వాదనలు వినిపించారు.

# చైనా రోబో డాగ్ కొని తామే అభివృద్ధి చేశామని ప్రచారం.. ఏఐ సదస్సులో యూనివర్సిటీ చీటింగ్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో ఓ యూనివర్సిటీ నిర్వాకంతో కలకలం రేగింది. చైనాకు చెందిన రోబో డాగ్ ను తమ ఆవిష్కరణగా ప్రదర్శించడమే ఈ కలకలానికి కారణం. ఉత్తరప్రదేశ్ కు చెందిన గల్గోటియాస్ యూనివర్సిటీ ప్రతినిధులు ఈ నిర్వాకానికి పాల్పడ్డారు. సోషల్ మీడియాలో ఈ రోబోట్ వీడియోలు వైరల్ కాగా.. చైనాకు చెందిన రోబో డాగ్ ను పోలి ఉందని నెటిజన్లు గుర్తించడంతో యూనివర్సిటీ మోసం బయటపడింది. దీంతో యూనివర్సిటీపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. సదస్సు నుంచి ఆ విద్యాసంస్థను తక్షణమే గెంటివేసి, వారికి కేటాయించిన స్టాల్‌ను అధికారులు ఖాళీ చేయించారు.

**అసలేం జరిగిందంటే..**

గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ యూనివర్సిటీ ఏఐ సదస్సులో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. తమ విశ్వవిద్యాలయంలోని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో 'ఓరియన్' పేరుతో ఒక రోబోడాగ్‌ను స్వయంగా అభివృద్ధి చేశామని వర్సిటీ ప్రతినిధులు ప్రచారం చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

**మోసం బయటపడిందిలా..**

యూనివర్సిటీ ప్రదర్శించిన రోబోడాగ్ చైనాకు చెందిన రోబోటిక్ కంపెనీ 'యూనిట్రీ' అభివృద్ధి చేసిన '+శీ2' మోడల్‌ను పోలి ఉందని నెటిజన్లు గుర్తించారు. ఆన్‌లైన్ లో సుమారు రూ.2 లక్షల నుండి రూ.3 లక్షల ధరకు భారతీయులకూ ఈ రోబోడాగ్ అందుబాటులో ఉంది. దీంతో సదరు యూనివర్సిటీ మోసం బయటపడింది. విదేశీ టెక్నాలజీని కొనుగోలు చేసి, దానిని భారత్ ఆవిష్కరణగా ప్రచారం చేసుకోవడంపై నెటిజన్లు తీవ్రంగా విమర్శలు గుప్పించారు.

**యూనివర్సిటీ ఏమంటోందంటే..**

వివాదం ముదరడంతో యూనివర్సిటీ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేసింది. తాము దానిని చైనా నుంచే కొనుగోలు చేశామని చెప్పింది. విద్యార్థుల పరిశోధనల కోసం ఒక సాధనంగా మాత్రమే వాడుతున్నామని పేర్కొంది. ఆ రోబో డాగ్ ను తామే అభివృద్ధి చేశామని ఎక్కడా ప్రచారం చేసుకోలేదని పేర్కొంది. అయితే, సోషల్ మీడియాలో ఉన్న వీడియోల్లో మాత్రం ఆ విద్యాసంస్థ ప్రతినిధులు ఇది తమ సొంత ఆవిష్కరణ అని స్పష్టంగా చెప్పడం గమనార్హం.

**కేంద్రం సీరియస్.. కఠిన చర్యలు**

అంతర్జాతీయ ప్రతినిధులు, టెక్ దిగ్గజాలు హాజరైన సదస్సులో ఇలాంటి తప్పుదారి పట్టించే చర్యలకు పాల్పడటంపై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించిన గల్గోటియాస్ యూనివర్సిటీ స్టాల్‌ను తొలగించి, సదస్సు నుంచి వారికి ఉద్వాసన పలికింది.

## రాష్ట్రంలోని రైతు సోదరులకు శుభవార్త!

ఆంధ్రప్రదేశ్‌లోని శనగ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా 2025–26 రబీ సీజన్‌కు సంబంధించి శనగల కొనుగోలు ప్రక్రియను నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ ధరల మద్దతు పథకం కింద మొత్తం 94,500 మెట్రిక్ టన్నుల శనగలను సేకరించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ నుంచి ఆదేశాలు అందాయని, నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థల ద్వారా ఈ కొనుగోళ్లు జరుగుతాయని వివరించారు.కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లో సీఎం యాప్ ద్వారా పర్యవేక్షణ ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు ఈ సేకరణను పర్యవేక్షిస్తాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్, ఏపీ మార్క్‌ఫెడ్ వంటి అన్ని శాఖల సమన్వయంతో నేరుగా రైతు సేవా కేంద్రాల్లోనే కొనుగోళ్లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రక్రియలో పూర్తి పారదర్శకత కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలను కూడా భాగస్వామ్యం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.25 లక్షల హెక్టార్లలో శనగ పంట సాగు చేయగా, దాదాపు 3.77 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంట కొనుగోలు చేసిన 15 రోజుల లోపే డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.

## మంత్రి కాన్వాయ్‌పై దాడి... బాల్క సుమన్ అరెస్టు

- మొదటి పేజి తరువాయి

సుమన్‌ను అరెస్టు చేసే సమయంలో కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు వారిపై లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టారు.క్యాతనపల్లిలోని ఆయన నివాసంలో బాల్క సుమన్‌ను అరెస్టు చేసిన పోలీసులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం రామగుండం తరలించనున్నారు. వివేక్ కాన్వాయ్‌పై దాడికి సంబంధించి రామకృష్ణాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏ1గా బాల్క సుమన్, ఏ2గా మూల రాజిరెడ్డి పేర్లను పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి మెజారిటీ స్థానాలు వచ్చాయి. అయితే కుట్రపూరితంగా మున్సిపాలిటీని చేజిక్కించుకోవాలని మంత్రి వివేక్ ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ క్రమంలో ఈరోజు బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు కలిసి క్యాతనపల్లి బంద్ కు పిలుపునిచ్చాయి.

## కల్తీ నెయ్యి అంశంపై చర్చకు సిద్ధం... ఆధారాలు ఉంటే అసెంబ్లీలో చర్చకు రండి

- మొదటి పేజి తరువాయి

అది నెయ్యి కాదు, రసాయనాల మిశ్రమమని సిట్ రిపోర్ట్ తేల్చిందని తెలిపారు. చర్చకు సిద్ధమని సభలోనే మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని గుర్తుచేశారు.దేవుడంటే వైసీపీ సభ్యులకు భక్తిభావం లేదని... పాల సేకరణ కూడా లేని సంస్థకు నెయ్యి సరఫరా కాంట్రాక్టును ఇచ్చారని అనిత మండిపడ్డారు. ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని అన్నారు. గతంలో పింక్ డైమండ్ పేరుతో సభా సమయాన్ని వృథా చేశారని... అధికారుల విచారణలో అసలు పింక్ డైమండే లేదని తేలిందని చెప్పారు. వేంకటేశ్వరస్వామితో పెట్టుకోవద్దని హెచ్చరించారు. సాక్షి పేపర్ రాసే విషయాలనే వైసీపీ నేతలు మాట్లాడుతుంటారని అనిత దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో యాడ్స్ రూపంలో సాక్షికి రూ. 600 కోట్ల ప్రజాధనాన్ని చెల్లించారని విమర్శించారు. మదనపల్లి చిన్నారి హత్య కేసు నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని... తప్పు చేశాడు కాబట్టే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు.

## ముక్కుపచ్చలారని పసిబిడ్డపై గంజాయి మత్తులో జరిగిన పైశాచికం ఇది

- మొదటి పేజి తరువాయి

ఘటనే నిదర్శనమని షర్మిల ఆరోపించారు. డ్రగ్స్, గంజాయిపై డేగ కన్ను పెట్టామని, ఉక్కుపాదం మోపుతామని కూటమి ప్రభుత్వం చెప్పుకోవడమంతా ఆర్భాటమేనని విమర్శించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారమంతా తూతూ మంత్రంగానే మిగిలిపోయిందని ఆమె దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని విమర్శించారు.బాధిత బాలిక కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పైశాచిక ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో వ్యక్తిగతంగా దృష్టి సారించాలని, గంజాయి, డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపడంతో పాటు నిరంతరం నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి రాష్ట్రాన్ని కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని షర్మిల స్పష్టం చేశారు.

## మేం కూడా లడ్డూపై చర్చిద్దామనే కోరుతున్నాం

ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు గుప్పించారు. మండలి మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... తిరుమల లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని అసత్య ప్రచారం చేస్తున్నారని, సీబీఐ దర్యాప్తులో ఎలాంటి కొవ్వు లేదని తేలిందని ఆయన అన్నారు."ఇందాపూర్ ద్వారా దోచుకోవాలనేది చంద్రబాబు దుర్బుద్ధి. హోంమంత్రి వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారు. మేం కూడా వాస్తవాలు తేల్చాలనే తిరుమల లడ్డూపై మండలిలో చర్చిద్దామని కోరుతున్నాం. ఇందాపూర్‌తో హెరిటేజ్ సంస్థ చీకటి ఒప్పందం చేసుకుంది. సభలో బడ్జెట్‌తో పాటు ఇందాపూర్, హెరిటేజ్‌పై చర్చించాల్సిందే" అని బొత్స అన్నారు.తాము చెబుతున్న దాంట్లో అవాస్తవాలు ఉంటే వాస్తవాలను తేల్చడానికి చర్చకు రావాలని బొత్స సవాల్ విసిరారు. ఆధారాలతో సహా తాము నిరూపిస్తామని చెప్పారు. రూ.320కి కొనుగోలు చేసే నెయ్యిని రూ.700కి పెంచడం వెనుక ఉన్న కారణం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని అన్నారు. వీళ్లు చేస్తున్న దోపిడీని బీజేపీ నేతలు సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి అధికారంలో ఉండే నైతికత లేదని అన్నారు. గతంలో తిరుమల లడ్డూ ఇస్తే భక్తులు కళ్లకు అద్దుకుని తినేవారని, ఇప్పుడు లడ్డూ ఇస్తే పరిశీలించి చూసి తింటున్నారని బొత్స చెప్పారు. మంత్రి నారా లోకేశ్ తెలిసీ తెలియక మాట్లాడుతున్నారని విమర్శించారు. తాము పట్టుకోల్పోయామనే భావనలో ఆయన ఉంటే ఉండనివ్వాలని... తమకు ఎలాంటి నష్టం లేదని అన్నారు.

## దేశ భద్రతకు రాహుల్ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి

లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు పెట్టుకున్నారని ఆరోపించారు. దేశ భద్రతకు రాహుల్ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని మండిపడ్డారు. దేశీయంగా, విదేశీ పర్యటనల్లో రాహుల్ నక్సలైట్లు, తీవ్రవాదులు, జార్జ్ సోరోస్ వంటి దేశ వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో సమావేశాలు జరుపుతున్నారని ఆరోపించారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే కూడా రాహుల్ గాంధీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయాలని కోరుతూ లోక్ సభలో మోషన్ ప్రవేశపెట్టారు. జార్జ్ సోరోస్ వంటి దేశ వ్యతిరేక శక్తుల సాయంతో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ, దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆయనపై జీవితకాల నిషేధం విధించాలని కోరారు.

## భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం

- మొదటి పేజి తరువాయి

అయితే ఈ అవకాశంతో పాటు గొప్ప బాధ్యత కూడా ఉంటుందని సుందర్ పిచాయ్ నొక్కిచెప్పారు. ఏఐ పరిశోధనలలో బలమైన పెట్టుబడులు పెట్టాలని, దాని వినియోగాన్ని అన్ని రంగాలకు విస్తరించాలని ఆయన సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి విభాగానికి ఏఐ ప్రయోజనాలు చేరేలా పునాది స్థాయి నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. గత కొన్నేళ్లుగా భారత్ డిజిటల్ రంగంలో అద్భుతమైన పురోగతి సాధించిందని పిచాయ్ ప్రశంసించారు. "భారతీయ వినియోగదారులు వాయిస్ ఆధారిత, ఇమేజ్ ఆధారిత సెర్చ్‌లను ప్రపంచంలోనే అత్యధికంగా స్వీకరిస్తున్నారు. ఇది దేశ ప్రజలు కొత్త టెక్నాలజీలను ఎంత వేగంగా అందిపుచ్చుకుంటున్నారో చూపిస్తోంది," అని ఆయన తెలిపారు. గూగుల్ ఏఐ టూల్ 'జెమినై'కి భారతదేశం అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా నిలవడం, ఇక్కడి వినియోగదారులలో ఏఐ పట్ల పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా, సుందర్ పిచాయ్ ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏఐ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి, దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులతో గూగుల్ ఎలా కలిసి పనిచేయగలదనే అంశాలపై వారు చర్చించారు. ఈ భేటీపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఏఐ రంగంలో ప్రభుత్వం, గూగుల్ మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకునే అవకాశాలపై పిచాయ్‌తో ఫలవంతమైన చర్చలు జరిపినట్లు తెలిపారు.

భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరాన్ని కూడా పిచాయ్ ప్రస్తావించారు. పాఠశాల విద్యార్థులలో చిన్న వయసు నుంచే ఆవిష్కరణ, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్'తో కలిసి గూగుల్ పనిచేస్తోందని, తరగతి గదుల్లోకి రోబోటిక్స్, కోడింగ్‌ను తీసుకువెళు తున్నామని వివరించారు. సరైన పెట్టుబడులు, విధానాలు అమలు చేస్తే, భారతదేశ సమగ్ర అభివృద్ధికి, దీర్ఘకాలిక పరివర్తనకు ఏఐ ఒక శక్తివంతమైన సాధనంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం

- మొదటి పేజి తరువాయి

అయితే ఈ అవకాశంతో పాటు గొప్ప బాధ్యత కూడా ఉంటుందని సుందర్ పిచాయ్ నొక్కిచెప్పారు. ఏఐ పరిశోధనలలో బలమైన పెట్టుబడులు పెట్టాలని, దాని వినియోగాన్ని అన్ని రంగాలకు విస్తరించాలని ఆయన సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి విభాగానికి ఏఐ ప్రయోజనాలు చేరేలా పునాది స్థాయి నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. గత కొన్నేళ్లుగా భారత్ డిజిటల్ రంగంలో అద్భుతమైన పురోగతి సాధించిందని పిచాయ్ ప్రశంసించారు. "భారతీయ వినియోగదారులు వాయిస్ ఆధారిత, ఇమేజ్ ఆధారిత సెర్చ్‌లను ప్రపంచంలోనే అత్యధికంగా స్వీకరిస్తున్నారు. ఇది దేశ ప్రజలు కొత్త టెక్నాలజీలను ఎంత వేగంగా అందిపుచ్చుకుంటున్నారో చూపిస్తోంది," అని ఆయన తెలిపారు. గూగుల్ ఏఐ టూల్ 'జెమినై'కి భారతదేశం అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా నిలవడం, ఇక్కడి వినియోగదారులలో ఏఐ పట్ల పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా, సుందర్ పిచాయ్ ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏఐ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి, దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులతో గూగుల్ ఎలా కలిసి పనిచేయగలదనే అంశాలపై వారు చర్చించారు. ఈ భేటీపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఏఐ రంగంలో ప్రభుత్వం, గూగుల్ మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకునే అవకాశాలపై పిచాయ్‌తో ఫలవంతమైన చర్చలు జరిపినట్లు తెలిపారు. భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరాన్ని కూడా పిచాయ్ ప్రస్తావించారు. పాఠశాల విద్యార్థులలో చిన్న వయసు నుంచే ఆవిష్కరణ, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్'తో కలిసి గూగుల్ పనిచేస్తోందని, తరగతి గదుల్లోకి రోబోటిక్స్, కోడింగ్‌ను తీసుకువెళు తున్నామని వివరించారు. సరైన పెట్టుబడులు, విధానాలు అమలు చేస్తే, భారతదేశ సమగ్ర అభివృద్ధికి, దీర్ఘకాలిక పరివర్తనకు ఏఐ ఒక శక్తివంతమైన సాధనంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# బెయిల్ పై విడుదలైన అంబటి రాంబాబు

- సెంట్రల్ జైలు వద్ద రాంబాబుకు స్వాగతం పలికిన వైసిపి క్యాడర్
- కూటమి ప్రభుత్వం పతనం అయ్యేవరకు పోరాటం ఆగదు: అంబటి రాంబాబు శపథం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 18:**రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూషించిన కేసులోనూ, సంక్రాంతికి లాటరీ టికెట్ల పేరుతో ప్రజలను మోసగించిన కేసులోను సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబుకు గుంటూరు కోర్టు బెయిల్ మంజూరు చేసిన బుధవారం అంబటి రాంబాబు జైలు నుంచి బుధవారం సాయంత్రం విడుదలయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రాంబాబుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జైలు బయట మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడుతూ, తనపై కూటమీ ప్రభుత్వం ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కక్ష పూరిత రాజకీయాలు చేశారని ధ్వజమెత్తారు. తాను ఆవేశంలో పొరపాటుగా సీఎం గూర్చి మాట్లాడిన మాటల పై క్షమాపణ కోరానని, అయినా కూడా కుట్రపూరితంగా తనపై వరస కేసులు కట్టి సెంట్రల్ జైలుకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను , తన కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం దిగే వరకు అలుపు ఎరగని పోరాటం చేస్తానని శపథం చేశారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలు చేయడం విరమించుకోవాలన్నారు. వచ్చే ప్రభుత్వం లో ఇదే తీరు గా బదులు తీర్చుకుంటామని హెచ్చరించారు. అంబటి వెంట పార్టీ క్యాడర్ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు




## పోలవరం నిర్వాసితులను పుష్కరాలకు ముందే తరలింపు...

- ఫేజ్ 1బిలో 1061 మంది తరలింపు
- 15 ఎకరాలలో పని మొదలు
- 500 కోట్లు ఫిబ్రవరి నెలలో విడుదల



కూనవరం,పెన్ పవర్,ఫిబ్రవరి 18.ఆంధ్ర రాష్ట్రం కోసం సర్వం త్యాగం చేస్తున్న పోలవరం నిర్వాసితులను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పుష్కరాలకు ముందే 2027 మార్చి 31 కల్లా పునరావాస కేంద్రాలకు తరలించాలని సంకల్పంతో ఉన్నదని మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ గ్రౌండ్ నందు నిర్వహించిన గ్రామసభలో పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్ అన్నారు.ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 1న 11 వందల కోట్లు విడుదల చేసిందని,ఫిబ్రవరి నెలలో 500 కోట్లు విడుదల చేయుటకు సిద్ధంగా ఉన్నదని చెప్పారు.కూనవరం పంచాయతీలో 3,500 మంది కి ఫేజ్ 1బి లో 1061 మందిని తరలించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది కానీ ఇంటి నిర్మాణం పూర్తి కాకుండా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వడానికి సుముఖంగా లేదని,ఎవరైతే ఇంటి నిర్మాణం సొంతంగా నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్నారో వారికి 5 సెంట్లు స్థలం,ఇంటి పట్టా ఇచ్చి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ,ఇంటి నిర్మాణానికి అయ్యే వ్యయం 2లక్షల 85వేలు ఒకేసారి వారి ఖాతాలో జమ చేస్తుందని అన్నారు.800 మంది నిర్వాసితులు ఉంటే 582 మందిని అప్రూవల్ చేశామని 218 మందిని రిజెక్ట్ చేయలేదని తాత్కాలికంగా వారిని నిలిపామని వారికోసం లితేడ్ అనే పదం వాడామని అన్నారు.మార్చి 15వ తారీకు లోపు మీ గ్రామాలలోకి మా సిబ్బంది వస్తారని వారికి అన్ని పత్రాలు ఇవ్వాలని అన్నారు. వారిచ్చిన పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించి వారిని అప్రూవల్ చేస్తామని ఎవరు భయపడవద్దని అన్నారు.పనులు జాప్యం కాకుండా ఉండటం కోసం 8 మంది ఎస్ డిసి లను ప్రత్యేకంగా ప్రభుత్వం నియమించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో చింతూరు ఐపిడిఏ పీవో శుభం నోక్వల్,ఎస్ డి సి బాలకృష్ణారెడ్డి,తాసిల్దార్ ధర్మేంద్ర,డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథ రావు,విఆర్ఓ వెంకన్న,గ్రామ ప్రజలు,రాజకీయ పార్టీ నాయకులు,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో విలీనమైన పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్

**రాజ మహేంద్ర వరం, పెన్ పవర్, ఫిబ్రవరి 18:**తూర్పుగోదావరి జిల్లాలో ఇటీవల విలీనమైన పోలీస్ స్టేషన్‌ల ను తనిఖీ చేసిన–జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్,

ఈ తనిఖీల లో జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్లో నిర్వహించే పలు రికార్డులను, పోలీస్ స్టేషన్ చుట్టుప్రక్కల పరిసరాలు, సీసీ కెమెరాలను పరిశీలించి, నమోదైన కేసులపై ఆరా తీసినారు. అనంతరం కేసులకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చినారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకై తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత ఎస్.హెచ్. ఓ లతో చర్చించడం జరిగిందన్నారు. సిబ్బంది శాంతి భద్రతలకు భంగం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ (ఈస్ట్ జోన్) శ్రీమతి బి. విద్య కొత్తగా విలీనమైన మండపేట టౌన్ పోలీస్ స్టేషన్, మండపేట రూరల్ పోలీస్ స్టేషన్, అంగర పోలీస్ స్టేషన్ , రాయవరం పోలీస్ స్టేషన్ల భౌగోళిక స్వరూపం, రాజకీయ స్వరూపం, స్థితిగతులు, నమోదైన కేసులు, లా అండ్ ఆర్డర్ ఇష్యూస్ వంటి వాటి గురించి జిల్లా ఎస్పీ కి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అధికారులకు ఈ క్రింది సూచనలు ఇచ్చినారు. రికార్డులన్నింటినీ క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలో డ్రోన్ సర్వైలెన్స్ విరివిగా ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమైన అన్ని ప్రాంతాలలో సి సి కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

అనుమానిత ప్రాంతాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించాలన్నారు.. సంబంధిత పోలీసు అధికారులు అందరూ విలేజ్ విజిట్స్, పల్లె నిద్ర తప్పక చేయాలని సూచించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ ఓపెన్ డ్రింకింగ్ పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు మరియు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి పూట గస్తీ ముమ్మరం చెయ్యాలనీ ,అను మానితుల వేలిముద్రలు ఎం సి డి



ఎస్ డివైస్ ద్వారా చెక్ చేయాలి.ఈ తనిఖీలలో ఇన్స్పెక్టర్ (మండపేట టౌన్) డి. సురేష్ , ఇన్స్పెక్టర్ (మండపేట రూరల్) దొర రాజు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్వాడి కేంద్రంలో ప్రీస్కూల్

## ఆహ్వానం -- అక్షరాభ్యాస కార్యక్రమం





**గంగవరం, పెన్ పవర్ ,ఫిబ్రవరి 18:**స్థానిక అంగన్వాడి కేంద్రంలో బుధవారం ప్రీస్కూల్ ఆహ్వానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని అంగన్వాడి టీచర్ లక్ష్మీ సుజాత నిర్వహించారు. చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలిసి కేంద్రానికి హాజరై అక్షరాలు దిద్దుతూ విద్యా జీవితానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా టీచర్ సుజాత మాట్లాడుతూ, ప్రతి చిన్నారి విధిగా పాఠశాలకు హాజరై క్రమశిక్షణతో చదువుకోవాలని, చిన్న వయసులోనే విద్యపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా పిల్లల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇదే సందర్భంలో స్థానిక విద్యార్థిని ఎన్. భువనప్రియ పుట్టినరోజు పురస్కరించుకుని ఆమె తల్లిదండ్రులు కేంద్రంలోని విద్యార్థులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతిరోజూ సమయానికి పాఠశాలకు హాజరై ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఎక్కువగా మంచినీరు తాగడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి వ్యక్తిగతంగా మంచినీటి బాటిల్ అందించడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అంగన్వాడి ఆయా తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ రికార్డులలో ఆడంగల్ మార్పుల అధికారాల బదలాయింపు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 18**

రెవెన్యూ రికార్డులలో వెబ్ ల్యాండ్ -- ఆడంగల్ మార్పుల అధికారాల బదలాయింపు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చెయ్యడం జరిగిందని రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్ కృష్ణ నాయక్ బుధవారం తెలియ చేశారు.

, ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవెన్యూ రికార్డులలోని వెబ్ ల్యాండ్ -- ఆడంగల్ నమోదు వివరాలలో మార్పులు, చేర్పులు చేయుటకు సంబంధించి జాయింట్ కలెక్టర్ కి ఉన్న అధికారాలను కింది స్థాయి అధికారులకు బదలాయింపు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడమైనదన్నారు. ఉత్తర్వుల ప్రకారం వెబ్ ల్యాండ్ ఆడంగల్ లో మార్పులు చేర్పులు చేయుటతో పాటు మ్యూటేషన్ ప్రక్రియకు సంబంధించిన అధికారాలు కూడా రెవెన్యూ డివిజనల్ అధికారులకు వర్తించనున్నవని తెలియ చేశారు. ఈ మార్పు ద్వారా ప్రజలకు వేగవంతమైన పౌర సేవలు అందించడమే లక్ష్యమని ఆయన తెలిపారు.రీ సర్వే పూర్తయిన గ్రామములలో ఎల్ పి ఎం ఆధారిత మ్యూటేషన్లు మరియు కరెక్షన్లు, పాత సర్వే నంబరు నమోదు, ప్రస్తుత భూమి వినియోగ వివరాలు, వ్యవసాయ భూములయితే నీటి లభ్యత నమోదు, పట్టాదారు పేరు మరియు భూమి సంక్రమణ విధానం నమోదు, ఆక్రమిత ఆసామి పేరు నమోదు, రికార్డ్ ఆఫ్ రైట్స్ లో విస్తీర్ణ మార్పులు షేప్ ఫైల్ ఆధారంగా చేయుట, ప్రస్తుత ఎల్ పి ఎం లో పట్టాదారు పేరు చేర్చుట, రికార్డులో సర్వే నంబరు లేనిపక్షంలో నమోదు చేయుట, భూమి స్వభావం క్లాసిఫికేషన్ మార్పులు, వివాదాస్పద భూముల రిజిస్టర్ లో ఎంట్రీలు చేర్చుట లేదా తొలగించుట, ఖాతా నంబరుఎల్ పి ఎం లో తప్పు మ్యాపింగ్ సవరణ వంటి అంశాలలో రెవెన్యూ డివిజనల్ అధికారి అధీకృతులుగా వ్యవహరించనున్నట్లు తెలియజేశారు.రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ఇనాం టు జిరాయితీ కేటగిరీలో 29 ధరకాస్తులు స్వీకరించగా 23 పరిష్కరించబడి 6 మిగిలి ఉన్నవి. అదే విధంగా సర్వే నంబరు నమోదు కేటగిరీలో 22 ధరకాస్తులు స్వీకరించి నట్లు తెలిపారు.ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్ని ధరకాస్తులను పారదర్శకంగా, సమయపాలనతో పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్. కృష్ణ నాయక్ తెలిపారు.




## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో అమరావతిలో ఎమ్మెల్యే బత్తుల భేటీ..

**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 18:**రాజానగరం నియోజకవర్గ సమస్యలపై పలు వినతలు అమరావతిలో మంత్రి లోకేష్ కు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అందజేశారు. బుధవారం ఉదయం రాజానగరం నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలను వినతిపత్రం రూపంలో మంత్రి లోకేష్ కి అందించారు.

రాజానగరం కోరుకొండ ప్రాంతాల్లో డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గాదరాడ, శ్రీకృష్ణపట్నం, దివాన్ చెరువు, రాజానగరం ప్రాంతాల్లో ఇంటర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని విన్నవించారు.

గతంలో డిగ్రీ, ఇంటర్ కళాశాలలో ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన విషయాలను వివరించారు.

పుణ్యక్షేత్రం,గాడాల, తుంగపాడు ప్లస్ 2 కాలేజీ నీ ఇంటర్ కాలేజీ గా మార్పు చేయాలని ఎమ్మెల్యే బలరామకృష్ణ వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే తమ రాజానగరం నియోజకవర్గ యువకుల కోసం ఒక పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ ను కోరారు.రాజానగరం నియోజకవర్గంలోని ముక్కినాడ, రాధేయపాలెం గ్రామాల్లో సెల్ టవర్ లో ఏర్పాటు చేయాలని విన్నవించారు. తమ రాజనగరం నియోజకవర్గంలో ఐటీ హబ్ ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మరోసారి ఉద్ఘాటించారు.రాజానగరం నియోజకవర్గంలో ఒక ఐటిఐ కాలేజీ ఏర్పాటు చేయాలని, ఒక ఎస్ టి పి ఐ ని కూడా ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది.మనబడి మన భవిష్యత్తు పథకానికి సంబంధించి అమలు లో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. రాజానగరంలో అడ్వాన్స్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేష్ ను ప్రత్యేకంగా కోరారు.నన్నయ అక్రమాలపై విచారణ చెయ్యాలి ఎమ్మెల్యే బత్తులఉభయగోదావరి జిల్లాల్లో సుమారు 400 పై గా కళాశాలలతో నడుస్తున్న ఆదికవి నన్నయ యూనివర్సిటీ అవినీతి అక్రమాలకు అడ్డాగా మారిందని మరోసారి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు.ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రస్తావించిన సంగతి తెలిసిందే.విద్యాశాఖ మంత్రి లోకేష్ ను బుధవారం ప్రత్యేకంగా కలిసిన ఎమ్మెల్యే బలరామకృష్ణ మరోసారి ఆదికవి నన్నయ యూనివర్సిటీ విషయాన్ని ప్రస్తావించారు.ఆదికవి నన్నయ యూనివర్సిటీలో స్పోర్ట్స్ ప్రాజెక్టులను సత్వరం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



# గిరిజన మహిళలకు ఉచిత బ్యూటీషన్ శిక్షణ

* జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ,ఫిబ్రవరి 18 :**పోలవరం జిల్లాలోని గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా 45 రోజులపాటు బ్యూటీషన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బచ్చు స్మరణ్ రాజ్ తెలిపారు. ఆయన బుధవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. జిల్లాలోని గిరిజన యువతుల ఆర్థిక స్వావలంబన కోసం మారేడుమిల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో 60 మంది అభ్యర్థులకు అనుభవజ్ఞులైన నిపుణులతో శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పించబడుతుందని చెప్పారు.పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన ఆసక్తి గల గిరిజన యువతులు ఫిబ్రవరి 21వ తేదీలోపు రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అలాగే జూశీఢ్ఞు.తీఏఙఎఏస్త్రఝుఅశ్రీ.ఏశీఏ కు ఆన్లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.మరిన్ని వివరాలకు 7569098197, 9440844871 నంబర్లను సంప్రదించాలని కోరారు. గిరిజన యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయాలని ఆయన ఆకాంక్షించారు.



## శిథిల కల్వర్టుతో పొంచి ఉన్న ముప్పు



**ఏలూరు ఫిబ్రవరి 18 పెన్‌పవర్ :** ఆగడాలంక నుండి కొల్లేరు లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన ఆగడాల లంక సచివాలయం ఎదురుగా ఉన్న రోడ్ నుంచి వియన్నపేట కాలనీలోకి వెళ్లే కల్వర్టు శిథిలమై పెద్ద గొయ్య ఏర్పడింది.డైన్‌పై పలకలు దెబ్బతిని రాకపోకలు సాగించే క్రమంలో చోదకులు అప్రమత్తంగా లేక ప్రమాదాలకు గురవుతున్నారు.రాత్రి వేళల్లో దగ్గరకు వచ్చే వరకు గొయ్యి కనిపించక పోవడంతో వాహనాలు అదుపు తప్పి పలువురు క్షత గాత్రులవుతున్నారు.ఈ ప్రధాన రహదారిపైఏలూరు రూరల్ మండలానికి చెందిన పైడిచింతపాడు,ప్రత్తికోళ్లంక, గుడివాకలంక గ్రామాలకు చెందిన రైతులు, విద్యార్దులు, ప్రజలు బస్సులలోను, ఆటోలలోనూ, ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు సాగిస్తుంటారు.పంచాయితీ అధికారులు స్పందించి కల్వర్టుపై పలుకలు ఏర్పాటు చేసి,గొయ్యను పూడ్చాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

# లీకై..ప్రమాదభరితమై



**ఏలూరు ఫిబ్రవరి 18 పెన్‌పవర్ :** ఏలూరు రూరల్ మండలం కొక్కిరాయిలంక నుండి పైడి చింతపాడు వెళ్ల ప్రధాన రహదారిపై రోడ్ పై పెట్టిన గుంతలో వాహన దారులు పడకుండా ఇనుప పోల్‌ను సూచికగా పెట్టారు.ఇక్కడ రోడ్ పై గుంత ఏర్పడి నీరు లీకై పంచాయితీ వాల్వ్‌లోకి ప్రవేశించి నీరు కలుషితమౌతొంది.ఇవి ప్రమాధభరితంగా మారాయి.నీరు లీకవ్వడంతో ఈ సమస్య తలెత్తింది.ఈ విషయమై కొక్కిరాయిలంక పంచాయితీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లగా లీకేజీని అరికట్టడంతో పాటు,రోడ్‌పై గుంతను వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## చెట్టున్నపాడులో పారిశుద్ధ్య సేకరణ కార్యక్రమం



**ఏలూరు ఫిబ్రవరి 18 పెన్ పవర్:** భీమడోలు మండలం చెట్టున్న గ్రామంలో బుధవారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించామని పంచాయతీ కార్యదర్శి స్ఫూర్తి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పలు వార్డులలో చెత్త సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించినట్లు తెలిపారు.

## విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ .




**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి18:** ఆశ్రమ బాలుర హై స్కూల్ అడ్డతీగల లో జిల్లా అందత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో, విద్యార్థులకు కంటి పరీక్ష నిర్వహించి, వారికి తగిన విధంగా డాక్టర్లు సలహా మేరకు వారికి కళ్ళజోళ్ళు ఉచితంగా పంపిణీ చేయుట జరిగినది. దీనిని మండల విద్యాశాఖ అధికారి. పి.శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ .ఏసు పాదం ( ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ) పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. ఆనందబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎండపల్లిలో ఉచిత వైద్య శిబిరం




* గంగవరం మండలంలోని లోపలి గ్రామాలకు వైద్య సేవలు
* ఈ నెలలో 8 గ్రామాల్లో క్యాంపులు

**గంగవరం పెన్ పవర్, ఫిబ్రవరి 18:** పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం గంగవరం మండలం ఎండపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బయటకు వెళ్లి వైద్యం చేయించుకోలేని ,లోపలి గ్రామాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి ఆదేశాల మేరకు ఈ వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ట్రస్ట్ ప్రతినిధులు శ్రీకాంత్, కందుల సాయి, కుంజం రామకృష్ణ దొర ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.గంగవరం మండలంలో ఈ నెల మొత్తం 8 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నారు. ఈనెల 19న సూరంపాలెం, 20న జగ్గంపాలెం, 21న రాజవరం, 23న మర్రిపాలెం, 26న ఓజు బంధ, 28న కుసుమరాయి గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఎండపల్లి గ్రామంలో జరిగిన శిబిరంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, గ్రామ పెద్దలు రేవుల అబ్బాయి రెడ్డి, లింగం వెంకట రెడ్డి, ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్యనిపుణులు డాక్టర్ ప్రసాద్, ఫార్మసిస్ట్ స్వర్ణ, ఎన్టీఆర్ ట్రస్ట్ సిబ్బంది నాని, ఆశ వర్కర్లు బాపనమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎం పి కార్యాలయం లో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ఏలూరు, ఫిబ్రవరి 18:** ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్స్ పంపిణి కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఢిల్లీ లో ఉన్న కారణంగా, ఓఎస్డీ ఫణీంద్ర చేతుల మీదుగా చెక్కుల పంపిణీ నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో ఆర్థిక సహాయం కోరుతూ ఎంపీ కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 87 మంది లబ్ధిదారులకి 55 లక్షల సీఎం ఆర్ ఎఫ్ చెక్ లు పంపిణి చేశారు. తమ ఆరోగ్య సమస్య, ఆర్థిక పరిస్థితులు వివరించగానే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందేట్లు చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు పలువురు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి, పోలవరం, ఏలూరు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నేతలు, ఎంపీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చేబ్రోలునారాయణపురం మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం



**పెన్ పవర్, ఉంగుటూరు, ఫిబ్రవరి 18**
భూసేకరణ వేగండ నివాసితుల్లో ఆందోళన
ఉంగుటూరు మండలం చేబ్రోలునారాయణపురం ఉమ్మడి గ్రామాల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ &బి ) నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ వేగవంతం కానుందనే సమాచారం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. రైల్వే గేట్ల వద్ద తరచూ ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిపాదించింది.

అలైన్‌మెంట్ ఇలాడ
చేబ్రోలుదేవరపల్లి ఆర్ & బి రహదారిలో చేబ్రోలు పాత టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం సమీపం నుండి సాయిబాబా గుడి, గ్రంథాలయం మీదుగా మసీదు సమీపంలోని ఇళ్ల మధ్య నుంచి రైల్వే పట్టాలు దాటి, జాతీయ రహదారి పక్కన నారాయణపురం శ్రీనివాస థియేటర్ పాత సినిమా హాల్ సమీపంలో బ్రిడ్జి దిగేలా రూపకల్పన చేసినట్లు సమాచారం. బ్రిడ్జికి ఇరువైపులా స్లోప్ రోడ్లు ఏర్పాటు చేయనున్నారు.
నారాయణపురం నాయుడుపేట ప్రాంతంలో సర్వీస్ రోడ్డు నిర్మాణం కోసం గృహ స్థలాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది.

7 ఎకరాల భూసేకరణ
ఈ ప్రాజెక్టు కోసం సుమారు 7 ఎకరాల భూమి అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. అందులో 5 ఎకరాలు రైల్వే శాఖకు చెందిన భూమి కాగా, మిగతా 2 ఎకరాలు ప్రైవేటు భూములు. సుమారు 68 మంది యజమానులకు చెందిన ఇల్లు స్థలాలు సేకరించాల్సి ఉందని తెలుస్తోంది.

1996 పరిహారం వివాదం మళ్లీ వెలుగులోకి
1996లో జాతీయ రహదారి విస్తరణ సందర్భంగా చేబ్రోలు గేట్ నుండి నారాయణపురం చేపల బజారు వరకు భూసేకరణ చేపట్టినప్పటికీ, కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో పరిహారం పూర్తిగా చెల్లించలేదని స్థానికులు చెబుతున్నారు. అయితే అప్పటికే డబ్బులు చెల్లించామని అధికారుల వర్గాలు చెప్పడం పై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

నివాసితుల గోడు
ఏళ్ల తరబడి కష్టపడి నిర్మించుకున్న ఇళ్లు అలైన్‌మెంట్‌లో ఉన్నాయని తెలిసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
“మేము మూడు తరాలుగా ఇక్కడే ఉంటున్నాం. అభివృద్ధి పేరుతో ఖాళీ చేయమంటే ఎక్కడికి వెళ్లాం? ఇచ్చే పరిహారం మా ఇంటి ప్రస్తుత విలువకు సరిపోతుందా?” అని ఒక స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశారు.
వాణిజ్య స్థలాలు సేకరిస్తే తమ జీవనాధారం దెబ్బతింటుందని వ్యాపారులు చెబుతున్నారు.

20-ఎ నోటిఫికేషన్ పై ఉత్కంఠ
భూసేకరణ చట్టం ప్రకారం 20-ఎ నోటిఫికేషన్ ఎప్పుడైనా జారీ కావచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారుల కదలికలు పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అధికారుల చర్యలు
ప్రాథమిక సర్వే పూర్తై, అలైన్‌మెంట్ మ్యాప్‌లు సిద్ధమైనట్లు సమాచారం. రైల్వే శాఖ, జాతీయ రహదారి, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ (ఆర్ &బి ) సమన్వయంతో ప్రాజెక్టు అమలు కానుంది. అయితే నష్టపరిహారం విషయంలో స్పష్టత లేకపోవడమే ప్రధాన సమస్యగా మారింది.
తదుపరి ప్రక్రియ భూసేకరణకు అధికారిక నోటిఫికేషన్ విడుదల బాధితుల అభ్యంతరాల స్వీకరణ మార్కెట్ విలువ లేదా ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం పరిహారం చెల్లింపు
అభివృద్ధి అవసరమేనని అంగీకరిస్తూనే, అది సామాన్యుల గూడును చిన్నాభిన్నం చేయకూడదని స్థానికులు కోరుతున్నారు. పారదర్శక చర్చలు, సరైన పునరావాసం కల్పిస్తేనే ఈ ఆందోళనకు తెరపడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# డ్రైనేజీలలో తాగునీటి పైపులు



**ఏలూరు ఫిబ్రవరి 18 పెన్‌పవర్ :** భీమడోలు మండలం చెట్టున్నపాడు గ్రామంలో తాగునీటి నిర్వహణ నిర్లక్ష్యంగా మారింది.గ్రామంలో ప్రజలకు సరఫరా చేసే తాగునీటి పైపులైన్ గత ఐదేళ్లుగా డ్రైనేజీలో ఉంది.6 నెలలుగా కాలువలో మురుగు తొలగించలేదు.పైపులైను లీకుల వల్ల తాగునీటి పైపుల్లోకి మురుగు వెళ్తోందని స్ధానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీనికి తోడు గత కొంత కాలంగా తాగునీరు సక్రమంగా రావడం లేదని తెలిపారు.తాగునీరు కలుషితమయితే ప్రజలు అనారోగ్యం బారిన పడతారు.అధికారుల పర్యవేక్షణ కొరవడింది.తాగునీటి సమస్యలపై దృష్టి సారించి పైపు లైన్లను డ్రైనేజీల నుండి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## మూగజీవాలకు నీటి తొట్టేలు ఏర్పాటు చేయని పశుసంవర్ధక శాఖ

* లంక గ్రామాల్లో తాగునీటి కోసం అల్లాడుతున్న పశువులు





**ఏలూరు ఫిబ్రవరి 18 పెన్‌పవర్ :** లంక గ్రామాల్లో పశువుల నీటితోట్టేన ఏర్పాటు చేయడంలో పశు సంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వేసవిలో మూగజీవాలు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి.మురికి గుంటలలో నీటిని తాగుతూ అవి దాహార్తిని తీర్చుకుంటున్నాయి.భీమడోలు మండలం ఆగడాలలంక, చెట్టున్నపాడు, ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక,పైడిచింతపాడు, ప్రత్తికోళ్లంక గ్రామాల్లో పంట కాలువలు ఉన్నాయన్న కారణంగా పశువులకు తాగునీటి తొట్టేలు ఏర్పాటు చేయలేదు.భీమడోలు మండలం చెట్టున్నపాడు గ్రామంలో సుమారు వెయ్యి వరకు పశు సంపద ఉంది.ఆగడాల లంక గ్రామంలో 3వేల వరకు పశుసంపద ఉంది.వీటికి తాగునీటికి తొట్లేలు సౌకర్యం కొసం అధికారులు స్పందించి నీటి తొట్టేలు ఏర్పాటు చేయాలని రైతాంగం,గొర్రెలు,మేకల పెంపకం దారులు కోరుతున్నారు

## గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు పుట్టినరోజు వేడుకలు






**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 18.**పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు పుట్టినరోజు సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం పట్టణ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో ఈరోజు బలుసులమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో విశేష పూజ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ విశ్వదుర్గేశ్వరి సమేత ఆనందేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ విశేష పూజ కార్యక్రమంను నిర్వహించారు.. ఈ సందర్భంగా గొర్రెల లక్ష్మీనారాయణ మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి వారితో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం టింబర్ డిపో కార్మికులకు దుప్పట్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో.. ఆలయ కమిటీ సభ్యులు, తెలుగుదేశం నాయకులు, గొర్రెల శ్రీధర్ యువసేన సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## స్వర్ణ ధనుస్సు ( స్వర్ణ కోదండం ) అయోధ్య బాలరాముని స్వర్ణ విగ్రహం దర్శనం







**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 18.**అయోధ్య కళ్యాణ రాముడి చేతిలో ప్రతిష్ట జరిగే మహిమాన్విత మైన శ్రీరామచంద్రమూర్తి వారి స్వర్ణ ధనుస్సు ( స్వర్ణ కోదండం ) అయోధ్య బాలరాముని స్వర్ణ విగ్రహం మరియు అనేక మంది పీఠాధిపతులు చే అనేక ఆలయలలో పూజలు అందుకున్న శ్రీ రామచంద్రమూర్తి వారి పాదుకలును అయోధ్య చల్లా శ్రీనివాస్ శాస్త్రి వారి నేత్రుత్వంలో భక్తులదర్శనార్థం పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం నందు ఏలూరు రోడ్డులోని శ్రీదేవి మహంకాలమ్మతల్లి ప్రతిరూప ఆలయం నందు , మంగళవారం సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 9.30 గంటల వరకు దర్శనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విశేషంగా భక్తులు విచ్చేసి కళ్యాణ శ్రీరామచంద్రమూర్తి వారి కోదండంను, బాలరాముని స్వర్ణవిగ్రహంను దర్శించి పాదుకలు స్పృశించి తన్మయత్వం పొందారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్ని నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అద్యక్షులు మరియు తాడేపల్లిగూడెం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ యెగ్గిన నాగబాబుగారు మరియు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పర్యవేక్షించారు.

## జీవీకే పాఠశాలలో అగ్ని ప్రమాద నివారణపై అవగాహన కార్యక్రమం




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 18:**రంపచోడవరం జిల్లా కేంద్రంలోని జీవీకే అప్పర్ ప్రైమరీ స్కూల్లో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి పి. కృష్ణదొర తన సిబ్బందితో కలిసి హాజరై అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్వీయ రక్షణ చర్యలు, బాధితులకు అందించాల్సిన ప్రాథమిక సహాయం గురించి విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. అగ్ని ప్రమాద సమయంలో భయపడకుండా అప్రమత్తంగా వ్యవహరించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. అగ్నిమాపక పరికరాల వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో బయటపడే మార్గాలు, చిన్నపాటి మంటలను ఎలా అదుపులోకి తీసుకురావాలో ప్రదర్శన ద్వారా చూపించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. శ్రీనివాసరావు,రంపచోడవరం హిందూ ధర్మ ప్రచార భక్త మండలి కోఆర్డినేటర్ నల్లమిల్లి వెంకట రామారెడ్డి, ఉపాధ్యాయులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## నిరవధిక సమ్మె .. సొసైటీలకు తాళం



**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 18:**తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు సల్పుతున్న వ్యవసాయ సహకార పరపతి సంఘాల సిబ్బంది దశల వారీగా నిర్వహిస్తున్న కార్యచరణలో భాగంగా విధులకు బహిష్కరించి సోమవారం నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్లడంతో సోసైటి కార్యాలయాల తాళాలు బుధవారం కూడా తెర్చుకోలేదు రెండు రోజులుగా కొనసాగుతున్న నిరవధిక సమ్మెతో సీతానగరం మండలంలోని రఘుదేవపురం బ్రాంచ్ సమ్మె చేపట్టడంతో 12 ప్రాథమిక సహకార పరపతి సంఘం లావాదేవీలు నిలిచిపోయాయి. తమ సమస్యలను పరిష్కరించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పిఏసిఎస్)ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు చేయడంతో వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు అందే సేవలు అందకపోవడంతో 2019 తరువాత జాయిన్ అయిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62కు పెంచాలనే డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న నిరవధిక సమ్మెకు రైతు సంఘాలు, రైతులు, ప్రజలు సంపూర్ణంగా మద్దతు ఇవ్వాలని సహకార సంఘ ఉద్యోగుల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ లు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలవరం జిల్లాకు పీజీఆర్ఎస్ నోడల్ అధికారిగా తూతిక శ్రీనివాస విశ్వనాధ్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 18:** నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జిల్లా నోడల్ అధికారిగా ద్వామా ఏపీడీ తూతిక శ్రీనివాస విశ్వనాధ్‌ను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ నియమించారు. ప్రజా సమస్యలపై సమగ్ర అవగాహన, సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర, విధి నిర్వహణలో నిబద్ధత వంటి లక్షణాల ఆధారంగా ఆయనను ఈ బాధ్యతలకు ఎంపిక చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా శ్రీనివాస విశ్వనాధ్ మాట్లాడుతూ జిల్లాలో పీజీఆర్ఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ప్రాజెక్ట్ అధికారి బచ్చు స్మరణ్ రాజ్ ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లాలో పీజీఆర్ఎస్ ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పదిమంది సిబ్బందితో ఏర్పాటైన ఈ ప్రత్యేక సెల్ ద్వారా విభాగాల వారీగా అందుతున్న ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, ఆడిట్ నిర్వహించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. ప్రజల సమస్యలు సమయానుకూలంగా పరిష్కారమవ్వడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## వికసిత భారత్ పై వారాంతరపు సమావేశం నిర్వహించిన అడ్డతీగల ఎంపీడీవో కుమార్...



**అడ్డతీగల,పెన్ వర్,ఫిబ్రవరి18:**వికసిత భారత్‌బిగ్యారంటీ రోజ్గార్ మరియు అజివిక మిషన్ (గ్రామీణ) సిబ్బంది తోబుధవారం వారాంతపు సమావేశాన్ని అడ్డతీగల ఎంపీడీవో కుమార్ నిర్వహించారు . పంచాయితీల వారిగ పురోగాతి రీవ్యూ చేశారు, 100బి150,రోజుల పనిదినాలు ఎక్కువ కుటుంబాలకు కల్పించాలని,అన్ని గ్రామపంచాయితీ లలో లేబర్ రిపోర్టు పెంచి,లేబర్ బడ్జెట్ పూర్తిస్తాయి లో వినియోగించుకోవాలని ఎంపీడీవో తెలిపారు . కమిషనర్ పంచాయతీ రాజ్ &రూరల్ డెవలప్మెంట్ ఆదేశాలు ప్రకారం ప్రతీ గ్రామ పంచాయతీ లో 20 కు మించి జరుగుతున్న పనులు ఉండకూడదు అనే నియమం ప్రకారం మండలం లో ప్రస్తుతం 12 గ్రామ పంచాయతీ లు మాత్రమే రావటం జరిగింది. మిగిలిన గ్రామపంచాయతీలు కుదతీసుకురవాలని,డీసీసీ వర్క్స్ కూడా పేమెంట్ పూర్తియినవి అని ఎంపీడీవో కుమార్ తెలిపారు. భువన ఫేజ్ 2 వర్క్స్ అన్ని పూర్తి చేయాలి అని ఎంపీడీవో ఆదేశించారు. టి. ఏ లు మీ క్లస్టర్ పరిధి లో ప్రోగ్రెస్ తక్కువగా ఉన్నయెడల దానికి సంబంధించి చర్యలు తీసుకోవడంజరుగుతుందన్నారు. ఏ పీ ఓ కు మొత్తం పర్యవేక్షణ చేయవలసిందిగా ఎంపీడీవో కుమార్ ఆదేశించారు.

## మాజీ ఎంపీ రత్నాభాయ్ మృతికి సంతాపం...



**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి18:** మండల కేంద్రమైన అడ్డతీగల గాంధీ సెంటర్లో రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి దంగేటి.సత్తిబాబు ఆధ్వర్యంలో రాజకీయ కుర వృద్ధురాలు మాజీ రాజ్యసభ సభ్యురాలు తడపట్ల.రత్నా బాయ్ మరణానికి సంతాపం తెలియజేశారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దంగేటి. సత్తిబాబు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఏజెన్సీ ప్రాంతంలో రత్నాభాయ్ చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్యేగా, జిసిసి చైర్ పర్సన్ గా, మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో రాజ్యసభ సభ్యురాలిగా, తర్వాత ఎమ్మెల్సీగా అలాగే కాంగ్రెస్ పార్టీలో మంచి పదవులు అలంకరించిన ఆమె కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారు అని దంగేటి అన్నారు. వక్తలు మాట్లాడుతూ రత్నా భాయ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని వారు అభిప్రాయపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి జలగం.వెంగళరావు హయాంలో అడ్డతీగల మండలానికి జీవనాడి అయిన మద్ది గడ్డ రిజర్వాయర్ తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కింది అన్నారు.

## ఆహారం-పోషణ-ఆరోగ్యంపై శిక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

**సెర్ఫ్- ఆర్ వై ఎస్ ఎస్ శాఖల సమన్వయ సమావేశం నిర్వహణ**

**గంగవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 18:**మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సెర్ఫ్-- ఆర్ వై ఎస్ ఎస్ శాఖల మధ్య సమన్వయ సమావేశం జడేరు గ్రామంలో నిర్వహించారు. ఆహారం, పోషణ, ఆరోగ్య కార్యాచరణ అమలు సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి గంగవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుచరిత ఆదిలక్ష్మీ, ఏపీఎం అప్పలకొండ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుచరిత ఆదిలక్ష్మీ మాట్లాడుతూ, మహిళలు మరియు పిల్లల ఆరోగ్య పరిరక్షణలో సమన్వయంతో పనిచేయడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. సమగ్ర పోషణ, సక్రమమైన ఆహారపు అలవాట్లు, ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అలాగే “100 రోజుల జాతీయ బాల్య వివాహ నిర్మూలన ప్రచార కార్యక్రమం”లో భాగంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, సమాజం మొత్తం కలిసి వాటిని అరికట్టాలని




పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జడేరు పంచాయతీలో “బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్” లక్ష్యానికి మద్దతుగా ప్రతిజ్ఞ చేయించారు. గంగవరం ప్రాజెక్టు సీడీపీఓ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

# బాల్య వివాహాలు చెయ్యొద్దు-జడ్పిటిసి బేబీ రత్నం




**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 18:**ప్రభుత్వం నిర్దేశించిన వయసు వచ్చేవరకు వివాహాలు చేయరాదని బాల్యవివాహాలను ప్రోత్సహించరాదని జెడ్పిటిసి బేబీ రత్నం అన్నారు. బుధవారం మండలంలోని బరిమామిడిలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కుమారి ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పిటిసి బేబీ రత్నం మాట్లాడుతూ ఆడపిల్లకు 18 సంవత్సరాలు మగ పిల్లలకు 21 సంవత్సరాలు వయసు నిండే వరకు వివాహాలు చేయరాదని అలా చేసిన యెడల చట్టరీత్యా శిక్షించడం జరుగుతుందన్నారు. సూపర్వైజర్ కుమారి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసినట్లయితే యువతీ యువకులు సరైన ఎదుగుదల లేకపోవడం వల్ల అనారోగ్యం తో పాటు ఆర్థిక సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటారన్నారు. బాల్యవివాహాలు చేసినట్లయితే తల్లిదండ్రుల తో పాటు ప్రోత్సహించిన వారి పైన క్రిమినల్ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తమన్న దొర, ఉపాధ్యాయురాలు రాములమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు నరసమ్మ, దేవి ,ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, సరోజినీ ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర విభజన తీరు పై సుప్రీంకోర్టు లో రాష్ట్ర ప్రభుత్వం వాదనలను వినిపించాలి



- విభజన వాటా 52 శాతం సాధించాలి
- సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ని శ్రద్ధ తీసుకోవాలి
- తిరుమల లడ్డు కల్తీ కేసు కొనసాగించండి
- కలియుగ దైవంతో రాజకీయాలు తగవు
- మీడియా సమావేశంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 19:**ప్రజాస్వామ్య దేశ చరిత్రలో ఆంధ్రప్రదేశ్ విభజన తీరు రాజ్యాంగ విరుద్ధంగా జరిగిందని ప్రజా ప్రయోజనాల రీత్యా తాను సుప్రీంకోర్టులో వేసిన కేసులో రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపించాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు పూర్తయిందని, అప్రజాస్వామ్యంగా, పార్లమెంట్ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన విభజన తీరును 2017 లో మాజీ సీఎం జగన్ తోనూ, ప్రస్తుత సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ , మేధావులతోనూ తాను చర్చించానని వారు తన వాదనకు మద్దతు ఇచ్చారన్నారు. అయితే ఆ తర్వాత 2023 వరకు వారెవరు కేసు వాదనను పట్టించుకోలేదని అన్నారు. ధర్మం చర హాల్లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ,
సుమారు పది సంవత్సరాలుగా సుప్రీంకోర్టులో విభజన తీరు పై వాదనలు జరుగుతున్నాయని తనతో పాటు సుప్రీంకోర్టు కూడా ఆసక్తి తగ్గుతుందన్నారు. ఇకనైనా సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు శ్రద్ధ తీసుకోవాలని, వారికి ఉత్తరాలు రాశానన్నారు. 0 సీనియర్ న్యాయవాదితో వాదనలు వినిపించాలని రాష్ట్ర ప్రయోజనాలు సాధించుకోవ చ్చునన్నారు. రాష్ట్ర విభజన చట్టం అనంతరం రాష్ట్రానికి రావలసిన 52 శాతం వాటా రూ.76 వేల కోట్ల రూపాయలు సాధించుకోవచ్చునన్నారు.
కేంద్రంలోని బిజెపి కూటమిలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఉందని కేంద్ర సహకారంతో రాష్ట్ర విభజన చట్టం ప్రయోజనాలను సాధించుకోవాలన్నారు. తద్వారా గత పది సంవత్సరాలుగా రెవెన్యూ లోటు నుంచి బయటపడవచ్చునన్నారు
తిరుమల లడ్డూలో కలిసి జరిగింది కానీ... రాజకీయాలు తగవు..
తిరుమల లడ్డులో రసాయనాల కల్తీ జరిగిందని సిట్ నివేదిక ఇచ్చిందని అన్నారు. అయితే కోర్టు సిట్ నివేదిక లో
జంతువుల కొవ్వు కలిసే అవకాశాలేవని తెలిపిందన్నారు. కలియుగ దైవంతో రాజకీయాలు చేయడం ఏ పార్టీకి, ఏ వర్గానికి తగమన్నారు. కల్తీ వ్యవహారంలో కేసు నడవాలని, నిందితులను శిక్షించాలన్నారు. అంబటి రాంబాబు పై కేసు పెట్టి జైలుకు పంపించాల్సిన కేసు కాదన్నారు. హిందూ మతోన్మాదానికి గురైన ముస్లిం వ్యాపారికి మద్దతుగా నిలిచిన విద్యామంత్రి లోకేష్ ధైర్యాన్ని అభినందించారు.

## వీఎల్టీ సవరణ బిల్లుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మద్దతు



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, ఫిబ్రవరి 19:**ప్రభుత్వం ప్రవేశపెట్టిన పురపాలక శాసనముల (రెండవ సవరణ) బిల్లు – 2026 రియల్ ఎస్టేట్ రంగానికి ఊరటనిస్తోందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. పురపాలక శాఖామాత్యులు నారాయణ ప్రవేశపెట్టిన వీఎల్టీ (వేకంట్ లే అవుట్ టాక్స్) అమెండ్మెంట్ బిల్లుకు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పూర్తి మద్దతు తెలిపారు. ఈ సవరణ రియల్ ఎస్టేట్, కన్స్ట్రక్షన్ రంగాలకు మళ్లీ జీవం పోస్తుందన్నారు . గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం ఈ సవరణ ను పక్కన పెట్టడంతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలు కుప్పకూలాయని ఎమ్మెల్యే తెలిపారు. భవన నిర్మాణ కాలంలో ఖాళీ స్థలాలపై పూర్తి పన్ను విధించడం వల్ల బిల్డర్లు, డెవలపర్లపై తీవ్ర ఆర్థిక భారం పడిందని, పట్టణ భూముల అభివృద్ధి నిరుత్సాహపరచిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతి తేదీ నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు ఖాళీ స్థల పన్నులో 50 శాతం రాయితీ కల్పించడం అభినందనీయమన్నారు. ఇది డెవలపర్లకు గొప్ప ఊరటనిస్తుందని, వ్యాపారవేత్తలు, క్రెడాయ్, నెరెడ్కో వంటి సంస్థల ప్రతినిధులు కూటమి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. నిర్మాణ రంగంలో హాజిల్ ఫ్రీ వాతావరణం కోసం తీసుకొచ్చిన సింగిల్ విండో విధానం వల్ల అప్రూవల్స్ అన్ని ఒకే చోట లభించి, పారదర్శకత పెరిగి వ్యాపారం సులభతరమవుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ట్రాఫిక్ రద్దీ పరిష్కారానికి తూర్పు వైపు విస్తరణ, బైపాస్ రోడ్ ఎంప్లోర్ చేయాలని, 15 కి.మీ. గోదావరి గట్టు పై నిబంధనలు సవరించి టూరిజం అభివృద్ధికి అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. పుష్కరాలు, టీడీఆర్ బోర్డుల ద్వారా ఎక్స్టెన్షన్, మెటీరియల్ కాం పోనెంట్ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ఈ బిల్లు వల్ల అన్ని పట్టణ స్థానిక సంస్థలు ఏకరీతిగా ఉండి నిర్మాణ రంగం పుంజుకుంటుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పూర్తి మద్దతు తెలిపారు.

## అడ్డతీగల లో ముమ్మరంగా వాహనతనిఖీలు...



**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి 18**: అడ్డతీగల మండలం వేటమామిడి జంక్షన్లో బుధవారం ఉదయం అడ్డతీగల ఎస్సై వినోద్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం అడ్డతీగల సీతపల్లి జంక్షన్లో వాహనాల తనిఖీ నిర్వహించారు.ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అనంతరం వాహన పత్రాలను పరిశీలించారు. పత్రాలు సరిలేని 15 మంది వాహనదారులకు అపరాధ రుసుము విధించడం జరిగిందని, అడ్డతీగల ఎస్సై వినోద్ తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరు వాహనానికి సంబంధించి పత్రాలు కలిగి ఉండాలని వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## జంబుపట్నం గ్రామంలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు..







- వేలాది మంది భక్తులు హాజరు..

**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 18:** కోరుకొండ మండలం జంబుపట్నం గ్రామంలో బుధవారం సాయంత్రం చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు శివాలయం ఎదురుగా ఉన్న స్థలంలో నిర్వహించారు. ఈ ప్రవచనాలు వినేందుకు భారీగా చుట్టుపక్కల గ్రామ ప్రజలు వేలాదిమంది హాజరయ్యారు. చాగంటి కోటేశ్వరరావు గారు సుమారు రెండు గంటల పాటు పరమశివుని గురించి ప్రసంగించారు.ప్రవచనాలు వినేందుకు స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో ప్రవచనాలు వినేందుకు హాజరయ్యారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## 2 ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి సేవలందించిన ఈలి వరలక్ష్మి మృతి బాధాకరం-మాజీ మంత్రి కొట్టు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 18**:రెండుసార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి సేవలందించిన వరలక్ష్మి మృతి బాధాకరమని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం కొబ్బరి తోటలో వరలక్ష్మి కుమారుడు యీలి నానిని ఆయన పరామర్శించారు. వరలక్ష్మి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తల్లి మృతి చెందడం బిడ్డలకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు భాస్కరరావు, ధర్మరాజు, సాంబయ్య, శ్రీనివాస్, జనార్ధన్ ఉన్నారు. అలాగే, రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ కార్మిక బోర్డు చైర్మన్ వలవల బాబ్జీ, బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి ఈతకోట తాతాజీ, పట్టణానికి చెందిన పలువురు వైద్యులు పరామర్శించారు.

## ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగానికి చెందిన డా. హీరా బట్టు గారికి "బెస్ట్ టీచర్ అవార్డు"



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి18.**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్లోని ఫార్మసీ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. హీరా బట్టు కి అంతర్జాతీయ బోధనా పురస్కారాలు--2026 సందర్భంలో "బెస్ట్ టీచర్ అవార్డు" ప్రదానం చేయబడింది. అసాధారణ బోధన, అచంచల నిబద్ధత, విద్యార్థుల శైక్షణిక ప్రగతిపై విశేష ప్రభావం చూపినందుకు దేవేలెట్ టెక్నాలజీ సంస్థ ఈ ప్రతిష్టాత్మక పురస్కారంతో ఆయనను సత్కరించింది. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. అశోక్, డా. హీరా బట్టు ని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఆయన బోధనా నైపుణ్యం, విద్యార్థుల పట్ల చూపే శ్రద్ధ, పరిశోధనా దృక్పథం విశ్వవిద్యాలయానికి గౌరవాన్ని తీసుకువచ్చాయని తెలిపారు.
అదేవిధంగా విభాగాధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు డా. హీరా బట్టు కి హృదయపూర్వక అభినందనలు తెలియజేసి, ఈ గౌరవం మొత్తం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## ప్రభుత్వ, ప్రైవేటు స్కూలులో స్కౌట్స్ అండ్ గైడ్ యూనిట్స్ ప్రారంభించాలి.





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 18.**ఉంగుటూరు మండల విద్యాశాఖ అధికారి 2 పి సాయిబాబు మాట్లాడుతూ మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూలులో స్కౌట్స్ అండ్ గైడ్ యూనిట్స్ ప్రారంభించాలని విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, పెంపొందించాలని సమాజానికి మంచి సేవ భావం గల పౌరులుగా విద్యార్థులను తయారు చేయుటకు కృషి చేయాలని మండల ఎమ్ ఆర్ సి భవనంలో జరిగిన స్కౌట్స్ అండ్ గైడ్ నూతన బిగినర్స్ శిక్షణ కార్యక్రమంలో విలువైన సూచనలు అందించారు స్కౌట్స్ గైడ్ శిక్షణ మండల శిక్షకులు గొల్లపల్లి రామారావు, నరసమాంబ మండలంలో అన్ని ప్రభుత్వ ప్రైవేట్ స్కూలు స్కౌట్ టీచర్స్ గైడ్ టీచర్స్ అందరూ పాల్గొన్నారు

## వికసిత భారత్ పై వారాంతరపు సమావేశం నిర్వహించిన అడ్డతీగల ఎంపీడీవో కుమార్...



**అడ్డతీగల,పెన్ పవర్,ఫిబ్రవరి18:**వికసిత భారత్బిగ్యారంటీ రోజ్గార్ మరియు అజివిక మిషన్ (గ్రామీణ) సిబ్బంది తోబుధవారం వారాంతపు సమావేశాన్ని అడ్డతీగల ఎంపీడీవో కుమార్ నిర్వహించారు . పంచాయితీల వారిగ పురోగాతి రీవ్యూ చేశారు, 100బి150,రోజుల పనిదినాలు ఎక్కువ కుటుంబాలకు కల్పించాలని,అన్ని గ్రామపంచాయితీ లలో లేబర్ రిపోర్టు పెంచి,లేబర్ బడ్జెట్ పూర్తిస్తాయి లో వినియోగించుకోవాలని ఎంపీడీవో తెలిపారు . కమిషనర్ పంచాయతీ రాజ్ ఉరూరల్ డెవలప్మెంట్ ఆదేశాలు ప్రకారం ప్రతీ గ్రామ పంచాయతీ లో 20 కు మించి జరుగుతున్న పనులు ఉండకూడదు అనే నియమం ప్రకారం మండలం లో ప్రస్తుతం 12 గ్రామ పంచాయతీ లు మాత్రమే రావటం జరిగింది. మిగిలిన గ్రామపంచాయతీలు కుడతీసుకురవాలని,డీసీసీ వర్క్స్ కూడా పేమెంట్ పూర్తియినవి అని ఎంపీడీవో కుమార్ తెలిపారు. భువన ఫేజ్ 2 వర్క్స్ అన్ని పూర్తి చేయాలి అని ఎంపీడీవో ఆదేశించారు. టి. ఏ లు మీ క్లస్టర్ పరిధి లో ప్రోగ్రెస్ తక్కువగా ఉన్నయెడల దానికి సంబంధించి చర్యలు తీసుకోవడంజరుగుతుందన్నారు. ఏ పీ ఓ కు మొత్తం పర్యవేక్షణ చేయవలసిందిగా ఎంపీడీవో కుమార్ ఆదేశించారు.

## సచివాలయం ఉద్యోగులు ఆన్లైన్ అటెండెన్స్ తప్పనిసరి

**వై రామవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 18:** వై రామవరం, గుర్తేడు మండలాల్లో పనిచేస్తున్న సచివాలయం ఉద్యోగులు అందరూ ప్రతి రోజు పని దినాలలో ఉదయం సాయంత్రం ఆన్లైన్ హాజరు తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్లో ఆదేశించారని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

నెలకు 90 శాతం హాజరు లేనియెడల జీతం బిల్లులు నిలుపుదల చేయడం జరుగుతుందని హెచ్చరించారు. డిప్యూటేషన్, పౌర సేవలకు వెళ్లిన సిబ్బంది కూడా కచ్చితంగా ఆన్లైన్ అటెండెన్స్ వెయ్యాలని అన్నారు. మెడికల్ లీవ్ల సంబంధిత అధికారుల ద్వారా ఆన్లైన్లో నమోదు చేయించుకోవాలని తెలిపారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# గిరిజనులకు భూమికు భూమి ఇవ్వాలి.

- గిరిజనులకు సర్వేలు,గ్రామసభలు జరిగి ఏడు సంవత్సరాలు
- ఆర్.అండ్.ఆర్.ప్యాకేజీ,రాకపోవడంతోఆందోళనలో పడ్డ గిరిజనులు



**వి.ఆర్.పురం పెన్.పవర్.పిబ్రవరి.18** పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్,అభిషేక్,ఐ.ఏ.ఎస్. చింతూరుఐ.టి.డి.ఏ.ప్రాజెక్టు,అధికారి వి.శుభంనోక్వాల్, కు బుధవారం మండలంలోని చొక్కనపల్లి,కల్తూనూరు, కొత్తూరు,శ్రీరామగిరి,యిపూరు,ములకపల్లి,జీడిగుప్ప,తదితరగ్రామాలగిరిజనులకు సర్వేలు,గ్రామసభలు,జరిగి సుమా రుఏడు సంవత్సరాలు కావస్తున్నా,ఇంతవరకు మాకు ఆర్.అండ్.ఆర్.ప్యాకేజీ,రాలేదుఅంటూ గిరిజనులు సంబంధిత అధికారులు ముందు మొరపెట్టుకున్నారు. చొక్కనపల్లి,గిరిజనరైతులకు భూమికుభూమి బుట్టా యిగూడెంమండలం రామన్నగూడెం దగ్గరలో ఉన్న కోయ రాజమండ్రిలోసంబంధితఅధికారులు ఇస్తాము,అన్నారు. ఇంతవరకు భూమిచూపించలేదని,వెంటనే మాకు చూపించాలని,వై.సి.పి.మండల ఎగ్జిక్యూటివ్,అధ్యక్షులు సోడి చిరంజీవి,గిరిజనులు పోలవరం సంబంధిత అధికారులను కోరారు.ఆర్.అండ్.ఆర్.ప్యాకేజీ,భూమికు భూమి సమస్య లపై సంబంధితఅధికారులు స్పందిసూ గిరిజన రైతులకు భూమికుభూమి ఆర్.అండ్.ఆర్.ప్యాకేజీ రానివారికి ప్యాకేజీ త్వరలోనే ఇస్తాము,అంటూ భరోసా ఇచ్చారు. అనంతరం గిరిజనులు సమస్యలతోకూడిన ధరఖాస్తు లను పోలవరంప్రాజెక్టు,సంబంధిత అధికారులకు అంద జేశారు.ఈకార్యక్రమంలో చొక్కనపల్లి,కల్తూనూరు,యిపూ రు,జీడిగుప్ప,తదితర గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

# బోల్లెద్దుపాలెం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ..

ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి.



**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 18:** కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెం గ్రామంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫార్సుతో మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయ నిధిచెక్కులను ఎమ్మెల్యే సతీమణి జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి అందజేశారు. గ్రామంలో నేరుగా అర్హులైన వారి ఇంటికి వెళ్లి వారి బాగోగులు అడిగి తెలుసుకుని ఆప్యాయంగా పలకరించే చెక్కునందించారు.
ఈ కార్యక్రమంలో కట్ట వెంకట్, కడిం భార్గవ్, పుప్పాల వెంకటరత్నం, జనసేన,తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీడీవో లక్ష్మణరావు



**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 18:**రానున్న వేసవికాలం నేపథ్యంలో మండలంలోని ఏ గ్రామంలోనూ మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణరావు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మణరావు సచివాలయం సిబ్బంది ఇంజనీరింగ్ అధికారులు తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని త్రాగునీటి వసతి పై ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా సచివాలయం సిబ్బంది పనిచేయాలన్నారు. సచివాలయాల పరిధిలో చేపడుతున్న పి 4, యు ఎస్ ఎఫ్ ,ఈ కేవైసీ సర్వే సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే నిర్మాణ దశలో ఉన్న పలు ఇంజనీరింగ్ పనులను త్వరితిగతను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు గోపన్న దొర నరసింహారావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, సచివాలయాల కార్యదర్శి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

# జిసిసి డ్రైవర్ అన్నిక వెంకటస్వామికి జనసేన నాయకుల ఘన నివాళులు




**గంగవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 18:**గంగవరం మండలం పాత రామవరం గ్రామానికి చెందిన జిసిసి డ్రైవర్ అన్నిక వెంకటస్వామి మృతికి జనసేన నాయకులు ఘనంగా నివాళులర్పించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, వెంకటస్వామి విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన మంచి వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన మరణం కుటుంబ సభ్యులకు, గ్రామ ప్రజలకు తీరని లోటని తెలిపారు. కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రంపచోడవరం మండల అధ్యక్షులు శ్రీను, గంగవరం మండల అధ్యక్షులు కుంజం సిద్దు, జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కాకి స్వామి, నియోజకవర్గ నాయకులు రాగాల సురేష్, పోతురాజు, వీర మహిళలు పండ వరలక్ష్మి, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర సాధన దిశగా బడ్జెట్ రూపొందించటం ప్రశంసనీయం.



బడ్జెట్ పై శాసనసభలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ విశ్లేషణ.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 18.**రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ స్వర్ణాంధ్ర సాధించే దిశగా ఉందని ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి కృషి ప్రశంసనీయమని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర శాసనసభలో బుధవారం ఆయన బడ్జెట్ పై ప్రసంగించారు. దూర దృష్టి కలిగిన నాయకత్వానికి నిదర్శనంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. సంక్షోభ సమయంలో సమర్ధవంతంగా పనిచేసి,ఆర్థిక పరిస్థితిని తీర్చిదిద్దే విధంగా ఉందన్నారు. స్వర్ణాంధ్ర 2020 -47 దిశగా బలమైన అడుగు పడిందన్నారు. రూ.3,32,205కోట్ల బడ్జెట్ ను రూపొందించి, 1.1 రెవెన్యూ లోటు, 3.84 ఆర్థిక లోటుగా పరిమితం చేయటం ప్రశంసనీయమన్నారు. అభివృద్ధి,బాధ్యత, భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని రూపొందించారని అన్నారు. విధ్వంసం నుండి వికాసం వైపు రాష్ట్రాన్ని ఈ బడ్జెట్ నడిపిస్తుందన్నారు. 205 అన్న కాంటీన్ ల ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నామన్నారు. కల్తీ నెయ్యితో తిరుపతి ప్రసాదాన్ని అపవిత్రం చేసి జగన్ ప్రభుత్వం తప్పు చేసిందన్నారు.రైతులు ధాన్యం ఎక్కడికి తీసుకెళ్లాలి, డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి నుంచి కూటమి ప్రభుత్వం 24 గంటల్లో రైతులకు డబ్బు అదే విధంగా కృషి చేసిందన్నారు. రైతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ల కృషి అభినందనీయమన్నారు. పంచాయతీరాజ్ శాఖ ను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపిన ఘనత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి దక్కుతుందన్నారు. పల్లెల్లో సర్పంచులను విలువ లేని పరిస్థితి నుంచి వారికి గౌరవ స్థానం కల్పించామన్నారు.జగన్ ఇంగ్లీష్ టీచర్లు లేకుండా ఇంగ్లీష్ మీడియం అంటూ విద్యార్థులను ఎటూ కాకుండా చేశారన్నారు. నాడు నేడు పేరుతో దోపిడీ జరిగిందన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. నిర్మించిన గోదావరి కాలువలను ఐదేళ్లుగా పట్టించుకోలేదన్నారు. 200 కోట్లు కేటాయించి కాలువలను బాగు చేయాలని కోరారు. జగన్ ఎస్సీ ఎస్టీ సోదరులకు సబ్ ప్లాన్ నిధులు అందకుండా చేశారని, విదేశీ విద్యను రద్దుచేసి అన్యాయం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎస్సీలకు 30 వేల కోట్లు, బీసీలకు 50 వేల కోట్లు కేటాయించిందన్నారు. పేద కాపులకు కూడా నిధులు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. కూటమిపాలన సర్వజనుల ఆమోదకరంగా ఉందని,2029 లో కూడా కూటమిదే అధికారమని బొలిశెట్టి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.




# ఘనంగా శ్రీసతి పార్వతి రుద్రకోటేశ్వరస్వామి తెప్పోత్సవం



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఫిబ్రవరి.18** ::మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో వెలసియున్న శ్రీసతి పార్వతి సమేత రుద్రకోటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన వార్షిక తెప్పోత్సవం భక్తి భావనల నడుమ అత్యంత వైభవంగా జరిగింది.విద్యుత్ దీపాలతో అలంకరించిన పవిత్ర కోనేరులో స్వామివారి ఉత్సవ విగ్రహాలను శోభాయమానమైన తెప్పపై ప్రతిష్ఠించి ఆలయ అర్చకులు వేదమంత్రాల మధ్య ఘనంగా ఊరేగింపుగా తీసుకెళ్లారు.దూర పరిసర మండలాల నుండి వేలాదిమంది భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శిం చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.సాయంత్రం ప్రారం భమైన కార్యక్రమం రాత్రివేళల వరకు భక్తుల జైఘో షల మధ్య కొనసాగింది.హారతులు,మంగళవా యిద్యా లు,భక్తి గీతాలు కార్యక్రమానికి మరింత ఆధ్యాత్మిక వాతావరణా న్ని అందించాయి.స్థానిక ఎస్.ఐ. సంతోష్ కుమార్,సతి సమేతంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో ప్రతి సంవత్సరం తెప్పోత్సవాన్ని ఘనంగా వైభవంగా నిర్వహిడంజరుగుతుందని,యువత కూడా పెద్దఎత్తున సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు.ఈ కార్యక్ర మంలో మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు,బొర్రా నరసింహ రావు,జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి,ముత్యాల సిద్దార్థ,ఆచంట శ్రీను,పెందుర్తి సుదర్శన్,సవలం రాజు, శేఖర్,ఆలయ చైర్మన్,ఆదినారాయణ,బీరక ప్రకాష్,రావు, పోలీసు సిబ్బంది.కోలాట బృందం,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతుల సంక్షేమం కోరుతూ మహాసభ



**కాజులూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 18:**కౌలు రైతుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం కాజులూరు మండల మహాసభ మండల అధ్యక్షుడు సువారు గోవిందు అధ్యక్షతన స్థానిక అంబేద్కర్ భవనంలో మహాసభ నిర్వహించారు. సమావేశంలో గత కార్యక్రమాలను సమీక్షించుకుని,రాబోయే మూడు సంవత్సరాల్లో ప్రాధాన్యంగా తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు.ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొస్తున్న విత్తన చట్టం రైతులకు నష్టదాయకమని విమర్శించారు.ఎరువులు,పురుగు మందుల ధరలు విపరీతంగా పెరగడంతో వ్యవసాయ ఖర్చులు అధికమయ్యాయని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదన్నారు.ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ,రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు అన్యాయం చేసిందన్నారు. పండించిన ధాన్యం అమ్ముకునేందుకు అవసరమైన కార్డులు ఇవ్వకపోవడం వల్ల కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. “అన్నదాత సుఖీభవ” పథకం కింద సొంత రైతులకు మాత్రమే ప్రయోజనం కల్పించారని,కౌలు రైతులకు ఒక్క రూపాయి కూడా అందలేదని ఆరోపించారు.సీసీఆర్సీ చట్టాన్ని మార్చి ఎల్ఈసీ చట్టం తీసుకొస్తామని చెప్పి అమలు చేయలేదని, పంటనష్టం జరిగి మూడు నెలలు అవుతున్నా పరిహారం అందలేదని విమర్శించారు.ఈ సమస్యలపై ఈనెల 23న కలెక్టర్ కార్యాలయం వద్ద 30 గంటల దీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అనంతరం కొత్త మండల కమిటీని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో కురుపోడి భూచక్రం,పెద్దింశెట్టి త్రిమూర్తులు,నామా చందద్రావు,గంజా అప్పారావు,దంగేటి శ్రీనివాసు,ఎం. జానకిరామయ్య,చీకట్ల శ్రీనివాసు,కడలి రాంపండు, అడపా ఆదినారాయణ,కట్ట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దేవాదాయ-ధర్మాదాయ శాఖ దౌర్జన్యాన్ని అరికట్టాలి.

-ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర నేత కర్నాకుల డిమాండ్.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 18:** దేవాదాయ, ధర్మాదాయ శాఖ దౌర్జన్యాన్ని అరికట్టాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు.సుమారు 80 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న తమ భూములకు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్న కాకినాడ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల దౌర్జన్యం నశించాలని నిరసిస్తూ బుధవారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో సాగు చేసుకుంటున్న పొలాల్లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మద్దతు తెలుపుతూ,మాట్లాడుతూ 80 సంవత్సరాల నుండి నిద్రపోతున్న ఎండోమెంట్ అధికారులకు ఇప్పుడు మెలకువ వచ్చిందని అందులో భాగంగానే ఈ భూములు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూములని,అవి ఖాళీ చేయాలని రైతులను భయభ్రాంతులకు గురి చేయడం సరైనది కాదని ఆయన విమర్శించారు. సుమారు 72 ఎకరాలు ఉన్న ఈ భూమిపై 100 కుటుంబాల చిన్న ,సన్నకారు పేద రైతులు జీవిస్తున్నారని, ఆ రైతులకు ఒక్క ఎకరం సొంత భూమి కూడా లేదని, తాత ముత్తాతల దగ్గర నుంచి కూడా ఈ భూమిని చేసుకుంటూ,కుటుంబాలను పోషించుకుంటున్నారని ఆయన తెలిపారు.ఈ భూములను రైతులు సొంత ఆస్తిగా భావించి కట్న కానుకలు ఇవ్వడం, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, అమ్మకాలు కొనుగోలు చేయడం ,ప్రభుత్వ బ్యాంకుల్లో రుణాలు తేవడం, పట్టాదారు పాసుబుక్కులు కూడా తెచ్చుకోవడం జరిగిందన్నారు.2015 వ సంవత్సరంలో ఈ భూమి కోసం కోర్టుకి కూడా వెళ్లడం జరిగిందని ఆయన వివరించారు. ఇంత జరుగుతున్న కూడా ఎండోమెంట్ అధికారులు ఇప్పుడు వచ్చి రైతులు పట్ల దౌర్జన్యంగా వ్యవహరించడం పై రైతు కూలీ సంఘం చాలా తీవ్రంగా ఖండిస్తుందని ఆయన తెలిపారు. ఈ భూములు కానీ తీసుకుంటే బూరుగుపూడిలో ఉంటున్న చిన్న ,సన్నకారు రైతుల బతుకులు రోడ్డును పడతాయని,దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోతారని ఆయన తెలిపారు. ఎండోమెంట్ అధికారులు ఇప్పటికిప్పుడు వచ్చి కొత్త చట్టాలు వచ్చినాయి, కొత్త రూల్స్ వచ్చినయ్, ఈ భూములు మీకు సంబంధం లేదు అని అంటే మేము ఊరుకోబోమని, రైతులపై దౌర్జన్యాలకు పాల్పడితే తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తోట వెంకన్న, పాలకుల సుబ్బారావు, చక్ర మంతి బాబ్జి,కర్రి అగ్గిరాముడు,నాగమల్లి అన్నారం, అడపా అప్పారావు,తదితర రైతులు పాల్గొన్నారు.

# భూపాలపట్నంలో వైభవంగా శ్రీ రామలింగేశ్వర స్వామి వారి త్రిశూల స్నానం



**కిర్లంపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 18:** మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామంలో వేంచేసియున్న శ్రీ పర్వతవర్ధనీ సమేత పంచాయతన రామలింగేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి.ఈ ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన బుధవారం ఆఖరి ఘట్టంగా త్రిశూల స్నానం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక జలాశయం వద్ద అర్చకులు వేదమంత్రాల మధ్య త్రిశూలానికి పవిత్ర స్నానమాచరింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, భూపాలపట్నం గ్రామ సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు తోపాటు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి త్రిశూల స్నానమాచరించి, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

## జైషా.. నఖ్వీ కాదు.. భారత్, పాక్ మ్యాచ్ జరగడానికి

# చక్రం తిప్పిన అసలు హీరో ఎవరంటే..?





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇస్లామాబాద్: టీ20 వరల్డ్ కప్ 2026లో ఇండియా, పాకిస్తాన్ మ్యాచ్ విజయవంతంగా ముగిసింది. 2026, ఫిబ్రవరి 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఈ హై ఓల్టేజ్ మ్యాచులో ఆల్ రౌండ్ షోతో అదరగొట్టిన భారత్ 61 పరుగుల తేడాతో దాయాది దేశాన్ని చిత్తుచేసింది. అయితే.. ఈ మ్యాచుకు ముందు ఎన్ని నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయో అందరికీ తెలిసిందే. వరల్డ్ కప్ నుంచి బంగ్లాదేశ్?ను ఐసీసీ భర్తరఫ్ చేయడం.. బంగ్లాకు మద్దతుగా ఇండియా మ్యాచును బాయ్ కాట్ చేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించడం.. దీంతో ఇండియా, పాక్ మ్యాచ్ జరుగుతుందా లేదా అని అభిమానుల్లో టెన్షన్.

ఈ క్రమంలో రంగంలోకి దిగిన ఐసీసీ పాకిస్తాన్?తో చర్చలు జరిపి ఎట్టకేలకు ఇండియా, పాక్ మ్యాచ్ యధావిధిగా జరిగేలా చూసింది. బాయ్ కాట్ విషయంలో పాక్ యూటర్న్ తీసుకుని ఈ మ్యాచ్ సక్సెస్ ఫుల్?గా జరగడంలో ఐసీసీ చైర్మన్ జై షా కీ రోల్ ప్లే చేసినట్లు ఊహాగానాలు వినిపించాయి. కానీ చిరకాల ప్రత్యర్థుల మధ్య మ్యాచ్ షెడ్యూల్ ప్రకారం జరిగేలా చక్రం తిప్పింది ఐసీసీ, ఐసీసీ చైర్మన్ జై షా కాదంట. శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సాయకే ఈ హై ఓల్టేజ్ మ్యాచ్ జరగడం చక్రం తిప్పిన అసలైన హీరో అంట. ఈ విషయాన్ని స్వయంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ వెల్లడించాడు.శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సాయకే సకాలంలో జోక్యం చేసుకుని టీ20 వరల్డ్ కప్?లో భారత్, పాక్ మ్యాచ్ జరిగేలా కృషి చేశారని నఖ్వీ పేర్కొన్నారు. ఇండియా, పాక్ మ్యాచ్ విజయవంతంగా జరగడంలో కృషి చేసినందుకు దిస్సాయకేకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నాడు. దిస్సాయకే తమ రాష్ట్రపతి, ప్రధానికి ఫోన్ చేసి ఇండియా, పాక్ మ్యాచ్ నిర్వహణకు ఒప్పించారని తెలిపారు. దిస్సాయకే కాల్ చేసిన వెంటనే ఇండియాతో మ్యాచ్ ఆడేందుకు ప్రభుత్వం తమకు అనుమతి ఇచ్చిందని నఖ్వీ వెల్లడించారు. సకాలంలో జోక్యం చేసుకుని 2 బిలియన్ల మంది ప్రజలకు వినోదం అందించిన అసలైన హీరో దిస్సాయకే అని నఖ్వీ కొనియాడారు. భద్రతా పరమైన కారణాలతో టీ20 వరల్డ్ కప్?లో ఇండియాలో పర్యటించేందుకు బంగ్లాదేశ్ నిరాకరించింది. తమ మ్యాచులను ఇండియా బయట నిర్వహించాలని బంగ్లా ఐసీసీని కోరింది. కానీ ముందుగానే షెడ్యూల్ ఖరారు కావడంతో బంగ్లా అభ్యర్థనను ఐసీసీ తిరస్కరించింది. మెగా టోర్నీ నుంచి బంగ్లాదేశ్?ను భర్తరఫ్ చేసి స్కాట్లాండ్?కు అవకాశం ఇచ్చింది.

బంగ్లాదేశ్?ను భర్తరఫ్ చేయడంతో ఆ జట్టుకు మద్దతుగా టీ20 వరల్డ్ కప్?లో ఇండియాతో మ్యాచ్?ను బాయ్ కాట్ చేయాలని పాక్ నిర్ణయించుకుంది. ఇండియా, పాక్ మ్యాచ్ రద్దు అయితే భారీగా ఆర్థిక నష్టం వచ్చే అవకాశం ఉండటంతో ఐసీసీ రంగంలోకి దిగి చర్చలు జరిపింద్ఘి. 2026 టీ20 వరల్డ్ కప్?కు ఇండియాతో పాటు అతిథ్యమిస్తోన్న శ్రీలంక కూడా పాకిస్తాన్?తో సంప్రదింపులు జరిపింది.

శ్రీలంకలోని కొలంబోలో జరగనున్న ఇండియా, పాక్ మ్యాచ్ రద్దు అయితే తమకు తీవ్రమైన ఆర్థిక నష్టం వాటిల్లుతోందని.. ఈ మేరకు శ్రీలంక ప్రెసిడెంట్ దిస్సాయకే పాక్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఐసీసీ, శ్రీలంక బోర్డు చర్చలతో దిగొచ్చిన పాక్ బాయ్ కాట్ విషయంలో యూటర్న్ తీసుకుని ఇండియాతో మ్యాచ్ ఆడేందుకు అంగీకరించింది.

# శివమ్ దూబే దంచుడు... భారత్ భారీ స్కోరు

- టీ20 వరల్డ్ కప్‌లో శివమ్ దూబే విధ్వంసక బ్యాటింగ్
- కేవలం 31 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 66 పరుగులు
- ఆరంభంలో తడబడ్డా.. భారత్ భారీ స్కోరు నమోదు
- సూర్యకుమార్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా కీలక పరుగులు
- నెదర్లాండ్స్ ముందు 194 పరుగుల టార్గెట్

టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా నెదర్లాండ్స్‌తో జరుగుతున్న గ్రూప్‌-ఏ చివరి లీగ్ మ్యాచ్‌లో భారత బ్యాటర్ శివమ్ దూబే విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. కేవలం 31 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 66 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. దూబే మెరుపులతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 193 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (0) డకౌట్‌గా వెనుదిరిగాడు. మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ (18) వేగంగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ (31), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (34) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ నిలకడగా ఆడి వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు.అనంతరం క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా (30)తో కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ముఖ్యంగా దూబే తనదైన శైలిలో భారీ షాట్లతో నెదర్లాండ్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. హార్దిక్ కూడా మూడు సిక్సర్లతో రాణించాడు. ఆఖర్లో



రింకూ సింగ్ (6 నాటౌట్) కూడా ఓ సిక్సర్ బాదడంతో భారత్ భారీ స్కోరు అందుకుంది. నెదర్లాండ్స్ బౌలర్లలో లోగాన్ వాన్ బీక్ 3 వికెట్లు, ఆర్యన్ దత్ 2 వికెట్లు తీశారు.

## టీ20 ర్యాంకింగ్స్... నెంబర్ వన్ పీఠం అభిషేక్ దే.. టాప్-10లోకి ఎంటరైన ఇషాన్ కిషన్

- టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ అగ్రస్థానం పదిలం
- భారీగా ఎగబాకి టాప్ 10లోకి దూసుకొచ్చిన ఇషాన్ కిషన్
- ఆల్ రౌండర్ల జాబితాలో సైమ్ అయూబ్ నంబర్ 1
- బౌలింగ్‌లో రెండో స్థానానికి ఎగబాకిన రషీద్ ఖాన్



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టీ20 ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో అతను పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నప్పటికీ, బ్యాటింగ్ జాబితాలో నంబర్ వన్ ర్యాంక్‌ను కాపాడుకోవడం విశేషం. మరోవైపు, విధ్వంసక వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ మరిన్ని స్థానాలు ఎగబాకి టాప్-10లోకి ప్రవేశించాడు.టీ20 ప్రపంచకప్‌లో భాగంగా అమెరికా, పాకిస్థాన్‌లపై డకౌట్ అయిన అభిషేక్ ఫామ్ గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ, అతను బ్యాటింగ్ శిఖరాగ్రాన తన ఆధిక్యాన్ని కొనసాగించాడు. ఇక, ప్రపంచకప్‌లో వరుసగా రెండో హాఫ్ సెంచరీ నమోదు చేసిన ఇషాన్ కిషన్ ఏకంగా 17 స్థానాలు మెరుగుపరుచుకుని 8వ ర్యాంకును దక్కించుకున్నాడు. కేవలం 40 బంతుల్లో 77 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకోవడం అతనికి కలిసొచ్చింది. శ్రీలంక ఆటగాడు పతుమ్ నిస్సంక మూడో స్థానానికి చేరుకున్నాడు.ఆల్ రౌండర్ల జాబితాలో పాకిస్థాన్‌కు చెందిన సైమ్ అయూబ్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. భారత్‌పై మూడు వికెట్ల ప్రదర్శనతో, జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజాను వెనక్కి నెట్టి నంబర్ వన్ అయ్యాడు.బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ ఒక స్థానం ఎగబాకి రెండో ర్యాంకుకు చేరుకున్నాడు. దీంతో అగ్రస్థానంలో ఉన్న భారత బౌలర్ వరుణ్ చక్రవర్తికి అతను మరింత చేరువయ్యాడు. భారత బౌలర్లు అక్షర్ పటేల్ (14వ ర్యాంక్), జస్ప్రీత్ బుమ్రా (15వ ర్యాంక్) కూడా తమ స్థానాలను మెరుగుపరుచుకున్నారు.

# మరీ ఇంత గ్యాప్ అంటే ఎలా కార్తికేయ?



యాషికా అన్నంద్ బోల్డ్ గాంభీర్యంతో ఫ్రేమ్‌ని నిప్పులు చెరిగారు

సినీ ఇండస్ట్రీలో సక్సెస్ కు టాలెంట్ ఎంత అవసరమో.. వరుస సినిమాలతో సందడి చేస్తుండడం కూడా అంతే అవసరం. ఒక సినిమా తర్వాత మరొక మూవీకి మధ్య కాస్త బ్రేక్ ఉండడం అన్ని విధాలుగా మంచిదే కానీ.. ఆ గ్యాప్ మరీ ఎక్కువైతే మాత్రం ప్రేక్షకుల్లో ఐడెంటిటీ తగ్గిపోవడం ఖాయం. ఇప్పుడు ఇదే పరిస్థితి యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కార్తికేయ గుమ్మకొండ విషయంలో కనిపిస్తోంది.కార్తికేయ అంటే వెంటనే అందరికీ గుర్తు రాకపోయినా.. ఆర్ఎక్స్ 100 మూవీ హీరో అంటే మాత్రం టక్కున గుర్తుకొస్తారు. దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఆ సినిమా అప్పట్లో సంచలన విజయం సాధించింది. ఆ చిత్రంతో కార్తికేయకు మంచి గుర్తింపు వచ్చింది. యూత్ లో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ కూడా క్రియేట్ అయింది. అదే సమయంలో అప్ కమింగ్ మూవీలపై అందరి దృష్టి పడింది.ఆ తర్వాత బెదురు లంక వంటి పలు తెలుగు చిత్రాల్లో హీరోగా నటించి తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు కార్తికేయ. కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ప్రయోగాలు చేశారు. హీరోగా మాత్రమే కాకుండా విలన్ గా కూడా నటించగల టాలెంట్ ఉన్న నటుడిగా పేరు తెచ్చుకున్నారు. అందుకు ఎగ్జాంపుల్ గా కోలీవుడ్ స్టార్ అజిత్ కుమార్ నటించిన వాలిమై సినిమాలో విలన్ పాత్రలో మెప్పించారు. ఆ పాత్ర ఆయనకు తమిళ ప్రేక్షకుల్లో గుర్తింపు తీసుకొచ్చింది.అయితే గత కొంతకాలంగా కార్తికేయ నుంచి కొత్త ప్రాజెక్టుల అనౌన్స్మెంట్లు లేకపోవడం అభిమానులను నిరాశపరుస్తుంది. 2024లో వచ్చిన భజే వాయు వేగం మూవీ తర్వాత ఆయన నుంచి మరో సినిమా గురించి క్లారిటీ రాలేదు. ఆ సినిమా కూడా పెద్దగా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోవడంతో ఆయన అప్ కమింగ్ ప్రాజెక్టులపై చర్చలు జరుగుతున్నాయి.ఇండస్ట్రీలో వినిపిస్తున్న టాక్ ప్రకారం, కార్తికేయ తన తదుపరి సినిమా షూటింగ్ ను పూర్తి చేసి టీజర్ తో సడెన్ గా సర్ప్రైజ్ ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారట. భజే వాయు వేగం విషయంలో కూడా ఇదే ప్లాన్ ఫాలో అయ్యారని చెబుతున్నారు. అయితే ఆ విషయం ఎంతవరకు నిజమో క్లారిటీ లేదు. కానీ ఇలాంటి ప్లాన్లు ఎప్పుడూ వర్కౌట్ అవుతాయనే గ్యారెంటీ లేదు.ప్రస్తుత రోజుల్లో ప్రేక్షకులు సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు అప్డేట్స్ కోరుకుంటున్నారు. కనీస సమాచారం లేకుండా హీరో పూర్తిగా కనిపించకుండా ఉంటే, ఆసక్తి తగ్గిపోవడం సహజం. దీంతో స్టార్ ఇమేజ్ దెబ్బతినే ప్రమాదం ఉంది. ఏదేమైనా కార్తికేయ వంటి టాలెంటెడ్ నటుడు కెరీర్ లో ఇలాంటి పెద్ద గ్యాప్ తీసుకోవడం రిస్క్ అనే చెప్పాలి. సరైన కథ, ప్లాన్ తో ప్రేక్షకుల ముందుకు వస్తేనే ఆయన మళ్లీ ఫామ్ లోకి రావచ్చు. ఇకపై కార్తికేయ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాలి.



పాలక్ తివారీ ఎత్నిక్ గాంభీర్యంతో మెరిసి పోయాడు



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965